ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
రాజన్న సిరిసిల్ల
జిల్లా వార్తలు
5★★★
మంగళవారం 25 నవంబరు 2025





రొటేషన్ పద్ధతిలో బీసీలకు తగ్గిన సర్పంచ్ స్థానాలు

2019 ఎన్నికల్లో 255 సర్పంచుల్లో 57 బీసీలకు, .. ఇప్పుడు 260 స్థానాల్లో 56 రిజర్వ్

2019 ఎన్నికల్లో 2,230 వార్డుల్లో బీసీలకు 540... ఇప్పుడు 2,268 వార్డుల్లో 553 స్థానాలు

వీర్నపల్లి మండలంలో బీసీలకు సర్పంచ్ స్థానాలు దూరం

జిల్లాలో మండలాల వారీగా సర్పంచ్ రిజర్వేషన్లు

మండలం	జీపీలు	ఎస్టీలు (100శాతం)	ఎస్టీలు	ఎస్సీలు	బీసీలు	జనరల్
బోయిన్‌పల్లి	23	--	---	06	05	12
చందుర్తి	19	01	--	04	05	09
ఇల్లంతకుంట	35	--	--	08	09	18
గంబీరావుపేట	22	03	--	04	05	10
కోనరావుపేట	28	05	--	05	06	12
ముస్తాబాద్	22	--	01	05	05	11
రుద్రంగి	10	08	--	--	01	01
తంగళ్లపల్లి	30	--	--	06	09	15
వీర్నపల్లి	17	06	02	03	–	06
వేములవాడ	11	--	--	03	02	06
వేములవాడరూరల్	17	--	--	04	04	09
ఎల్లారెడ్డిపేట	26	03	01	05	05	12
మొత్తం	260	26	04	53	56	121

బీసీల ఆశలు గల్లంతు

(ఆంధ్రజ్యోతి సిరిసిల్ల)

పంచాయతీ ఎన్నికల్లో ముఖ్య ఘట్టమైన రిజర్వేషన్ల ప్రక్రియ పూర్తి చేసి గెజిట్ జారీ చేశారు. గెజిట్‌లో పొరపాట్లు ఎలా ఉన్నా బీసీల ఆశలు గల్లంతయ్యాయనే విమర్శలు వినిపిస్తున్నాయి. రాజన్న సిరిసిల్ల జిల్లాలో పాత పద్ధతిలో రిజర్వేషన్లు ఖరారు చేసిన 2019 ఎన్నికల రిజర్వేషన్లతో పోల్చి కుంటే బీసీల రిజర్వేషన్లు తగ్గిపోయాయి. వీర్నపల్లి మండలంలో బీసీలకు సర్పంచ్ స్థానాలే కేటాయించలేదు. వీర్నపల్లిలో 17 గ్రామ పంచాయతీలు ఉండగా 8 ఎస్టీలకు, మూడు ఎస్సీలకు, ఆరు జనరల్ స్థానాలుగా రిజర్వ్ చేశారు. బీసీలకు రిజర్వ్ కాలేదు. జిల్లాలో కొన్ని గ్రామపంచాయతీలో వార్డు స్థానాలు బీసీ, ఎస్సీలకు రిజర్వు కాలేదు. దీంతో సర్పంచ్, స్థానాలు కోలోయిన బీసీ ప్రతి నిధులు సోమవారం జిల్లాలో నిరసన తెలిపారు. వీర్నపల్లి మండలంలో బీసీలకు సర్పంచ్ స్థానాలు కేటాయించకపోవడంతో మాజీ ప్రజాప్రతినిధులు, బీసీ నాయకులు రాజన్న సిరిసిల్ల జిల్లా కలెక్టరేట్‌కు వచ్చి నిరసన తెలిపారు. ప్రజావాణిలో బీసీ స్థానాలు కేటాయించాలని, రంగంపేటలో వార్డుల్లో ఎస్సీలకు స్థానాలు కేటాయించాలని వినతిపత్రం అందించారు. ఇల్లంత కుంట మండలంలో వెంకట్రావుపల్లి, తిప్పాపూర్ పంచా యతీల వార్డుల్లో బీసీలకు స్థానాలు కేటాయించక పోవడంతో వెంకట్రావుపల్లె పంచాయతీ కార్యాలయం వద్ద బీసీలు నిరసన తెలిపారు. ఇదిలా ఉండగా గెజిట్లో పొరపాట్లు కూడా దొర్లాయి. ఇల్లంతకుంట గ్రామపంచాయతీలో 12 వార్డులు ఉండగా 10 వార్డులకు రిజర్వేషన్లతో గెజిట్ జారీ చేశారు. తరువాత మళ్లీ సవరించి గెజిట్ జారీ చేశారు.

260 సర్పంచ్, 2,268 వార్డు స్థానాలకు రిజర్వేషర్లు

సిరిసిల్ల జిల్లాలో 260 సర్పంచ్, 2,268 వార్డు స్థానాలు ఉన్నాయి. వీటికి సంబంధించిన రిజర్వేషన్ల ప్రక్రియ పూర్తి చేశారు. 2011 జనాభా దామాషా ప్రకారం ఎస్సీ, ఎస్టీ రిజర్వేషన్లు ఖరారు చేశారు. సామాజిక, ఆర్థిక, విద్య, ఉపాధి, రాజకీయ కులగణన- 2024 సర్వే లెక్కల ప్రకారం బీసీ డెడికేటెడ్ కమిషన్ ఇచ్చిన నివేదిక ప్రకారం సుప్రీంకోర్టు, హైకోర్టు ఆదేశాల మేరకు 50 శాతం మించకుండా రిజర్వేషన్లు పూర్తిచేసి గెజిట్ జారీ చేశారు. గతంలో ప్రకటించిన రిజర్వేషన్లు అమలైతే బీసీ సీట్లు భారీగా ఉండేవి. ఇప్పుడు సీట్లను గణనీయంగా కోల్పోయారు. పాత రిజర్వేషన్ పద్ధతిలో కూడా బీసీలకు నిరాశే మిగిలింది. 2019 పంచాయతీ ఎన్నికల రిజర్వేషన్ కంటే కూడా ఇప్పుడు బీసీలకు సీట్లు తగ్గిపోయాయి. 2019 ఎన్నికల్లో 255 గ్రామపంచాయతీలు ఉంటే బీసీలకు 57సర్పంచ్ స్థానాలు, 2,230 వార్డు స్థానాల్లో 540 బీసీలకు కేటాయించారు.

ప్రస్తుతం ప్రకటించిన రిజర్వేషన్లలో 260 సర్పంచ్ స్థానాల్లో 56 బీసీలకు రిజర్వ్ చేశారు. ఇందులో మహిళకు 24 స్థానాలు, జనరల్‌గా 32 స్థానాలు ఉన్నాయి. వంద శాతం ఎస్టీ పంచాయతీలు 26 ఉండగా 11 మహిళలకు,

మిగతా 8వ పేజీలో

జిల్లాలో మండలాల వారీగా వార్డుల రిజర్వేషన్లు

మండలం	జీపీలు	ఎస్టీలు (100శాతం)	ఎస్టీలు	ఎస్సీలు	బీసీలు	జనరల్
బోయిన్‌పల్లి	212	--	---	56	50	106
చందుర్తి	174	08	–	32	51	83
ఇల్లంతకుంట	294	--	–	62	85	147
గంభీరావుపేట	202	20	03	36	52	91
కోనరావుపేట	238	28	01	47	57	105
ముస్తాబాద్	202	--	06	44	47	101
రుద్రంగి	86	56	02	03	09	15
తంగళ్లపల్లి	252	--	–	50	76	126
వీర్నపల్లి	132	46	12	14	09	43
వేములవాడ	104	--	01	25	26	52
వేములవాడరూరల్	146	--	01	33	39	73
ఎల్లారెడ్డిపేట	226	18	09	40	52	102
మొత్తం	2,268	176	53	177	553	1044



ప్రజావాణిలో కలెక్టరేట్‌లో వినతిపత్రం అందిస్తున్న వీర్నపల్లి ప్రతినిధులు

సీపీఐ శత వసంతాల ఉత్సవాలు



మాట్లాడుతున్న సీపీఐ జిల్లా కార్యదర్శి మంద సుదర్శన్

సిరిసిల్ల టౌన్, నవంబరు 24 (ఆంధ్ర జ్యోతి): సీపీఐ శత వసంతాల ఉత్సవాలను విజయవంతం చేయాలని సీపీఐ జిల్లా కార్యదర్శి మంద సుదర్శన్ అన్నారు. సోమవారం జిల్లా కేంద్రంలోని సీపీఐ జిల్లా కార్యాలయంలో ముఖ్య నాయకుల సమావేశం జరిగింది. అనంతరం విలేకరుల సమావేశంలో సుందర్శన్ మాట్లాడారు. సిరిసిల్ల, వేములవాడ నియోజకవర్గాలలోని గ్రామాలలో సర్పంచ్‌లు, వార్డు సభ్యుల ఎన్నికలలో సీపీఐ అభ్యర్థులు పోటీచేస్తారని అన్నారు. డిసెంబర్ 26న ఖమ్మం జిల్లాలో సీపీఐ శత వసంతాల ఉత్సవాలు నిర్వహిస్తున్నామన్నారు. డిసెంబర్ 23న వేములవాడలో సీపీఐ జిల్లా శాఖ ఆధ్వర్యంలో సీపీఐ శత వసంతాల ఉత్సవాలకు 100ద్విచక్రవాహనాలతో బైక్ ర్యాలీ ఉంటుందన్నారు. సమావేశంలో సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యు లు కడారి రాములు, కేవీ అనుసూర్య, తీపిరెడ్డి తిరుపతిరెడ్డి, మంద అనిల్, సామనపెల్లి మల్లేశం, వడ్డెపల్లి లక్ష్మణ్, కూర రాకేష్ పాల్గొన్నారు.

కులగణన సర్వే ఆపరేటర్లకు డబ్బులు చెల్లించాలి

సిరిసిల్ల టౌన్, నవంబరు 24 (ఆంధ్రజ్యోతి): తెలంగాణలో కులగణన సర్వే చేసిన ఆపరేటర్లకు ప్రభుత్వం వెంటనే డబ్బులు చెల్లించాలని సీపీఐ సిరిసిల్ల పట్టణ కార్యదర్శి పంతం రవి అన్నారు. సోమవారం జిల్లా కేంద్రంలోని సీపీఐ జిల్లా కార్యాలయంలో విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. తెలంగాణలో అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం అట్టహాసంగా కులగణన చేపట్టిందన్నారు. నెల రోజులు శ్రమించి కులగణన చేపట్టిన యువతీ యువకుల(ఆపరేటర్లు)కు నెల రోజులలోపు డబ్బులు చెల్లించాల్సి ఉండగా ఇప్పటి వరకు డబ్బులు చెల్లించక పోవడం దురదృష్టకరం అన్నారు. జిల్లా పరిధిలో దాదాపు 400 మంది యువతీ యువకులు కులగణన చేశారని అన్నారు. డబ్బులు చెల్లించకుంటే సీపీఐ ఆధ్వర్యంలో జిల్లా కేంద్రంలో ఆందోళనలను చేపడతామన్నారు. ఈ కార్యక్రమంలో సీపీఐ పట్టణ నాయకులు పాల్గొన్నారు.

జిల్లా స్థాయి అథ్లెటిక్స్ పోటీలు



పరుగుపందెంలో పాల్గొన్న విద్యార్థులు

సిరిసిల్ల టౌన్, నవంబరు 24 (ఆంధ్రజ్యోతి) : జిల్లా కేంద్రం ప్రభుత్వ జూనియర్ కళాశాల క్రీడా మైదానంలో జిల్లా అథ్లెటిక్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో సోమవారం జరిగిన అస్మిత జిల్లా స్థాయి అథ్లెటిక్స్ పోటీలలో బాలికలు సత్తాచాటారు. అస్మిత ఉమెన్స్ లీగ్ భారత క్రీడా ప్రాధికార సంస్థ, యువజన వ్యవహారలు, క్రీడా మంత్రిత్వ శాఖ ఆధ్వర్యంలో ఖేలో ఇండియాలో భాగంగా అస్మిత ఉమెన్స్ లీగ్ అథ్లెటిక్స్ పోటీలను దేశ వ్యాప్తంగా 26 రాష్ట్రాల నుంచి 300 జిల్లాలను ఎంపిక చేయగా అందులో రాజన్న సిరిసిల్ల జిల్లా ఉంది. ఇందులో భాగంగా బాలికలకు అండర్ - 14, అండర్ - 16 విభాగాలలో రన్నింగ్, డిస్కస్ త్రో, షాట్‌పుట్, జావలిన్ త్రో పోటీలను జిల్లా కేంద్రంలో నిర్వహించారు. జిల్లాలోని 13 మండలాల నుండి బాలికలు పెద్ద సంఖ్యలో పోటీలలో హాజరయ్యారు. ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రిన్సిపల్ కే విజయ రఘునందన్ 600 మీటర్ల రన్నింగ్ పోటీలను పచ్చ జెండా ఊపి ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో జిల్లా అథ్లెటిక్స్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి బొజ్జ చంద్రశేఖర్, ఉపాధ్యక్షుడు గొట్టె రాంచంద్రం, కోశాధికారి వినోద్, జాయింట్ సెక్రెటరి అజయ్‌కుమార్, కబడ్డీ అసోసియేషన్ మండల అధ్యక్షుడు బొడ్డు నారాయణ, సైకాలజిస్ట్ పున్నం చందర్ ఉన్నారు.

లోవోల్టేజీ సమస్య నివారణకు చర్యలు

ఇల్లంతకుంట, నవంబరు 24(ఆంధ్రజ్యోతి): మండలంలోని రేపాక గ్రామంలో నెలకొన్న లోవోల్టేజీ సమస్య నివారణకు సెస్ అధికారులు పనులు ప్రారంభించారు. గ్రామంలోని ఎస్సీ కాలనీలో అనేక రోజులుగా లోవోల్టేజి సమస్య ఉండటంతో మానకొండూర్ ఎమ్మెల్యే డాక్టర్ కవ్వంపల్లి సత్యనారాయణ స్పందించి సెస్ అధికారులతో మాట్లాడారు. కార్యక్రమంలో మాజీ ఎంపీటీసీ కాథ సుమలతమల్లేశం, కాంగ్రెస్ గ్రామశాఖ అధ్యక్షుడు దయాసాగర్, మాజీ ఉపసర్పంచ్ లింగం, నాయకులు శేఖర్, భాను, శ్రీతేజ, తిరుపతి, మల్లేశం, బాబు, రాజు, రవి, శ్రీను ఉన్నారు.

బీసీలకు స్థానాలు కేటాయించలేదని నిరసన

ఇల్లంతకుంట, నవంబరు 24(ఆంధ్రజ్యోతి): మండలంలోని వెంకట్రావుపల్లె గ్రామంలోని గ్రామపంచాయతీ ఎన్నికల కోసం విడుదల చేసిన గెజిట్‌లో వార్డుస్థానాలలో ఒక్కటి కూడా బీసీలకు కేటాయించ లేదని గ్రామపంచాయతీ కార్యాలయం ఎదుట నిరసన వ్యక్తం చేశారు. గ్రామంలో ఏనమిది వార్డులు ఉండగా అందులో బీసీలకు రిజర్వేషన్ లేదని తెలుసుకున్న బీసీ సంఘాల నాయకులు సోమవారం కార్యాలయం వద్దకు చేరుకొని ఆవేదన వ్యక్తం చేశారు. గ్రామంలో నాలుగు జనరల్, నాలుగు ఎస్సీలకు కేటాయించి, బీసీల ఆత్మగౌరవాన్ని దెబ్బతీశారని ఆరోపించారు. కార్యక్రమంలో అనగోని యాదగిరిగౌడ్, కూనబోయిన మల్లయ్య, బత్తిని వెంకటేష్, మహేష్, లాస్య, రాయలింగం ఉన్నారు.

మహిళా సంఘాలకు వడ్డీ లేని రుణాలు

- వీడియో కాన్ఫరెన్స్‌లో ఉపముఖ్యమంత్రి భట్టి విక్రమార్క

సిరిసిల్ల కలెక్టరేట్, నవంబర్ 24 (ఆంధ్రజ్యోతి) : మహిళా స్వయం సహాయక సంఘాల మహిళలకు వడ్డీలేని రుణాలను మంగళవారం నుంచి పంపిణీ చేయనున్నట్లు రాష్ట్ర ఉపముఖ్యమంత్రి భట్టి విక్రమార్క వెల్లడించారు. మహిళా ఉన్నతి-తెలంగాణ ప్రగతి కింద ఇందిరమ్మ చీరల పంపిణీ పురోగతి, నియోజకవర్గాల్లో వడ్డీలేని రుణాల పంపిణీ అంశాలపై సీఎస్ రామకృష్ణారావుతో కలిసి ఉప ముఖ్యమంత్రి భటి విక్రమార్క జిల్లా ఇన్‌చార్జి కలెక్టర్ గరిమా అగర్వాల్‌తో సమీక్షించారు. ఈ సందర్భంగా ఉప ముఖ్యమంత్రి మాట్లాడుతూ మూడవ విడత వడ్డీ లేని రుణాలను మంగళవారం జిల్లాలోని సిరిసిల్ల, వేములవాడ అసెంబ్లీ నియోజకవర్గ కేంద్రాల్లో ప్రత్యేకంగా ఏర్పాటు చేసే కార్యక్రమంలో పంపిణీ చేపట్టాలని సూచించారు. రాష్ట్ర పంచాయితీ రాజ్, మహిళాభివృద్ధి శాఖ మంత్రి ధనసరి అనసూయ సీతక్క మాట్లాడుతూ, నాణ్యమైన ఇందిరమ్మ చీరలను అందించడం పట్ల రాష్ట్రంలోని మహిళలందరూ సంతోషం వ్యక్తం చేస్తున్నారని అన్నారు. పెద్ద ఎత్తున వడ్డీ లేని రుణాలను కూడా అందించడం పట్ల రాష్ట్ర ముఖ్యమంత్రి, ఉప ముఖ్యమంత్రికి ధన్యవాదాలు తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి రామకృష్ణారావు మాట్లాడుతూ, జిల్లాల్లో ఇందిరమ్మ చీరల పంపిణీని వేగవంతంగా పంపిణీ చేయడంపై కలెక్టర్‌ను అభినందించారు.

నేడు రుణాల పంపిణీ

- జిల్లా ఇన్‌చార్జి కలెక్టర్ గరిమా అగర్వాల్

సిరిసిల్ల కలెక్టరేట్, నవంబర్ 24 (ఆంధ్రజ్యోతి): జిల్లాలోని స్వయం సహాయక మహిళా సంఘాలకు ఇందిరా మహిళాశక్తి కింద వడ్డీ లేని రుణాలను రాష్ట్ర ప్రభుత్వం పంపిణీ చేస్తుందని జిల్లా ఇన్‌చార్జి కలెక్టర్ గరిమా అగర్వాల్ తెలిపారు. జిల్లాలోని 8,871 స్వయం సహాయ మహిళా సంఘాలకు రూ. 8కోట్ల 12 లక్షలు సిరిసిల్ల, వేములవాడ, చొప్పదండి, మానకొండూర్ నియోజకవర్గాల్లో పంపిణీ చేస్తామన్నారు. ప్రజాప్రభుత్వం మొదటి విడుతలో 7,802 స్వయం సహాయ మహిళా సంఘాలకు రూ. 7 కోట్ల 40లక్షలు, 2వ విడుతలో 8,552 సంఘాలకు రూ.11కోట్ల 78లక్షలు వడ్డీలేనిరుణాలు పంపిణీ చేసినట్లు తెలిపారు. మూడో విడుత వేములవాడ పట్టణంలోని రామలింగేశ్వర గార్డెన్‌లో మంగళవారం ఉదయం 11 గంటలకు ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే ఆదిశ్రీనివాస్ రుణాలు పంపిణీ చేస్తారన్నారు. జిల్లా సమీకృత కలెక్టరేట్‌లోని సమావేశమందిరంలో మధ్యాహ్నం 1గంటకు సిరిసిల్ల నియోజకవర్గంలోని మహిళా సంఘాలకు రుణాలు పంపిణీ చేయడం జరుగుతుందని జిల్లా ఇన్‌చార్జీ కలెక్టర్ తెలిపారు.

ఇందిరమ్మ ఇళ్లతో ప్రతీ కుటుంబంలో ఆనందం

- ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్

వేములవాడ, నవంబరు 24 (ఆంధ్రజ్యోతి): ఇందిరమ్మ ఇళ్లు మంజూరైన లబ్ధిదారులు కుటుంబంతో ఎంతో ఆనందంలో ఉన్నారని ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ అన్నారు. వేములవాడ పట్టణంలోని తిప్పాపూర్ గ్రామంలో సోమవారం ఇందిరమ్మ ఇళ్లు లబ్దిదారు సగ్గు లావణ్య-శ్రీనివాస్ దంపతుల గృహప్రవేశ కార్యక్రమానికి ప్రభుత్వ విప్ హాజరై నూతన వస్త్రాలను అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దేశంలో ఇండ్లు లేని పేద వాళ్లు ఉండకూడదనే ఆలోచనతో ఇందిరాగాంధీ పథకాన్ని ప్రవేశపెట్టారని అన్నారు. సీఎం రేవంత్‌రెడ్డి నేతృత్వంలో రాష్ట్రం అభివృద్ది పథంలో ముందుకు సాగుతుందని సూచించారు. రాష్ట్రంలో ప్రవేశపెట్టిన సంక్షేమ పథకాలతో ప్రజలు ఆనందంలో ఉన్నారని గుర్తు చేశారు. రానున్న రోజుల్లో మరిన్ని ప్రజలకు మరింత చేరువయ్యే పథకాలను రూపకల్పన చేస్తున్నట్లు వివరించారు. వేములవాడ నియోజకవర్గంలో విడుతల వారిగా ఉండ్లు లేని పేదవారికి ఇందిరమ్మ ఇళ్లను మంజూరు చేస్తున్నామని తెలిపారు. ప్రతి నిరుపేద కుటుంబానికి గౌరవప్రదమైనది ఇళ్లు అన్నారు. ఇంటి కల కాంగ్రెస్ ప్రభుత్వంతోనే సాధ్యమవుతుందని చెప్పారు. ఈ కార్యక్రమంలో సంద్రగిరి శ్రీనివాస్, నాగుల విష్ణుప్రసాద్, అక్కనపల్లి నరేష్, దుర్గం పర్శరాములు కాంగ్రెస్ నాయకులు తదితరులు ఉన్నారు.



ఇందిరమ్మ ఇంటి గృహప్రవేశానికి హాజరై విప్ ఆది శ్రీనివాస్

అసిస్టెంట్ హెల్పర్‌ల సమస్యలు పరిష్కరించాలి

సిరిసిల్ల రూరల్, నవంబరు 24 (ఆంధ్రజ్యోతి): సిరిసిల్ల సహకార విద్యుత్ సరఫరా సంఘం పరిధిలో పనిచేస్తున్న అసిస్టెంట్ హెల్పర్‌ల సమస్యలను సెస్ పాలకవర్గంతో పాటు అధికారులు పరిష్కరించి న్యాయం చేయాలని తెలంగాణ రాష్ట్ర యూనిటైడ్ ఎలక్ట్రిసిటీ ఎంప్లాయిస్ యూనియన్ రాష్ట్ర అధ్యక్షుడు ఈశ్వర్‌రావు, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి నలవాల స్వామి, జిల్లా అధ్యక్షుడు కర్నాల అనిల్‌కుమార్ డిమాండ్ చేశారు. సిరిసిల్ల పట్టణంలో సోమవారం తెలంగాణ రాష్ట్ర యూనిటైడ్ ఎలక్ట్రిసిటీ ఎంప్లాయీస్ యూనియన్ జిల్లా కమిటీ ఆధ్వర్యంలో ర్యాలీ నిర్వహించి సెస్ ప్రధాన కార్యాలయం ఎదుట బైటాయించి ధర్నా చేపట్టారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ సెస్ పరిధిలో పనిచేస్తున్న అసిస్టెంట్ హెల్పర్‌ల సమస్యలను పరిష్కరించాలంటూ సెస్ పాలకవర్గంతో ఎండీలకు వినతిపత్రం ఇచ్చినా స్పందన లేకపోవడంతో ధర్నా చేపడుతున్నట్లు తెలిపారు. ఇప్పటికైనా సెస్ పాలకవర్గం సెస్ పరిధిలో పనిచేస్తున్న ఉద్యోగులకు తక్షణమే పదోన్నతులు కల్పించాలన్నారు. పనిచేస్తున్న సమయంలో మరణించిన ఉద్యోగుల కుటుంబంలో ఒకరికి కారుణ్య నియామాకాలను ఇచ్చిన ఇప్పటి వరకు రెగ్యులర్ చేయడంలేదని వారిని రెగ్యులర్ చేయాలన్నారు.ఒకే ఉద్యోగంలో కొన్నేళ్లుగా పనిచేస్తున్న ఉద్యోగులకు టీజీ ఎన్‌పీడీసీఎల్‌లో అమలులో ఉన్న విధానం ప్రకారం మానిటరీ బెనిఫిట్స్ ఇవ్వాలన్నారు. అసిస్టెంట్ హెల్పర్ పేరు జెఎల్ఎంగా మార్చడంతో పాటు తమ డిమాండ్లను పరిష్కరించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర డిప్యూటి ప్రధాన కార్యదర్శి చంద్రారెడ్డి, ఎన్‌పీడీసీఎల్ కంపెనీ అధ్యక్షుడు అంజనేయులు, రాష్ట్ర కమిటిసభ్యులు శేఖర్‌రెడ్డి, సిరిసిల్ల జిల్లా సీటీఈయూ అధ్యక్ష, కార్యదర్శులు ఎగమంటి ఎల్లారెడ్డి,కోడం రమణ, కరీంనగర్ టౌన్ అధ్యక్షుడు తిరుపతి, టౌన్ డివిజన్ కార్యదర్శి శ్రీకాంత్ ఉన్నారు.



సిరిసిల్ల సెస్ కార్యాలయం ఎదుట ధర్నా చేస్తున్న అసిస్టెంట్ హెల్పర్‌లు

ప్రజల సమస్యలను పరిష్కరించాలి : ఎస్పీ

సిరిసిల్ల రూరల్, నవంబరు 24 (ఆంధ్రజ్యోతి): ప్రజల సమస్యలను తెలుసుకుని వారి ఫిర్యాదులను స్వీకరించి పరిష్కరించే దిశగా పోలీసులు సత్వరమే న్యాయం చేయాలని జిల్లా ఎస్పీ మహేష్‌బీగీతే కోరారు. సిరిసిల్ల జిల్లా కేంద్రంలో జిల్లాపోలీస్ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన గ్రీవెన్స్ డే కార్యక్రమంలో 32 మంది బాధితులతో మాట్లాడి ఫిర్యాదులను స్వీకరించారు. ఈ సందర్భంగా జిల్లా ఎస్పీ మాట్లాడుతూ ప్రజలకు పోలీస్ సేవలు మరింత చేరవ చేయడమే లక్ష్యంగా, ప్రజా సమస్యలు పరిష్కరించే విధంగా కృషిచేయడం జరుగుతుందన్నారు. పోలీస్ అధికారులు, సిబ్బంది పోలీస్ స్టేషన్‌కు వచ్చిన ఫిర్యాదుదారులతో మార్యాదపూర్వకంగా ప్రవర్తించి అవసరమైన క్షేత్రస్థాయిలో పరిశీలించి చట్ట ప్రకారం బాధితులకు న్యాయం జరిగే విధంగా చూడాలన్నారు. తద్వారా ఫిర్యాదుదారులకు పోలీస్ శాఖపై భరోసా, నమ్మకం కలుగుతుంద న్నారు. గ్రీవెన్స్ డేలో వచ్చిన ఫిర్యాదులు అన్‌లైన్‌లో పొందుపరుస్తూ ఏమేరకు పరిష్కారం అయ్యాయో ఎప్పటి కప్పుడు సమీక్షించుకుంటూ ప్రజలకు మరింత సమర్థవంతంగా సేవలందించడం జరుగుతుందన్నారు. గ్రీవెన్స్ డే ద్వారా ప్రజలు నేరుగా తమ సమస్యలను అధికారుల దృష్టికి తీసుకరావడంతో సాధ్యమైనంత త్వరగా వాటిని పరిష్కరించేలా చూస్తామని ఎస్పీ తెలిపారు.



బాధితుల నుంచి సమస్యలు వింటున్న ఎస్పీ

ద్విచక్రవాహనం అదుపుతప్పి యువకుడి మృతి

● పెళ్లయిన రెండు నెలలకే ఘటన



ప్రవీణ్(ఫైల్)

ఎల్లారెడ్డిపేట, నవంబరు 24 (ఆంధ్రజ్యోతి): ఎల్లారెడ్డిపేట మండలం రాజన్నపేట గ్రామశివారులోని మూలమలుపు వద్ద ఆదివారం అర్ధరాత్రి ద్విచక్రవాహనం అదుపుతప్పి అదే గ్రామానికి చెందిన శివరాత్రి ప్రవీణ్(25) అక్కడికక్కడే మృతిచెందాడు. కుటుంబ సభ్యులు, పోలీసుల కథనం మేరకు.. గ్రామానికి చెందిన ప్రవీణ్ కూలి పనులు చేస్తూ జీవిస్తుండేవాడు. మహబూబ్‌నగర్ జిల్లాకు చెందిన యువతి స్వాతిని రెండునెలల క్రితం ప్రేమించి పెళ్లి చేసుకున్నాడు. ఈ నెల 23న ప్రవీణ్ తన కుటుంబీకులతో కలిసి మండలంలోని పదిరలో సమీప బంధువుల వివాహానికి వెళ్లాడు. అదేరోజు రాత్రి ప్రవీణ్ బంధువుకు చెందిన బైక్ తీసుకుని రాజన్నపేటలోని స్నేహితుడి భరత్ వేడుకలకు హాజరయ్యాడు. తిరుగు ప్రయాణంలో రాజన్నపేట గ్రామశివారులో ద్విచక్రవాహనం అదుపు తప్పి పక్కన ఉన్న చెట్టపొదల్లోకి దూసుకెళ్లి మృతిచెందాడు. సోమవారం ఉదయం రహదారి వెంట వెళుతున్న పలువురు గమనించి పోలీసులకు సమాచారం అందించారు. ఘటన స్థలానికి చేరుకుని పరిశీలించారు. మృతిచెందిన వ్యక్తి గ్రామంలోని అనిల్‌గా గుర్తించారు. విషయం తెలుసుకున్న కుటుంబ సభ్యులు అక్కడకు చేరుకున్నారు. వివాహమైన రెండు నెలలకే అనిల్ మృతిచెందడంతో భార్య స్వాతి రోదించిన తీరు అక్కడున్న వారిని కలిచి వేసింది. మృతుడికి భార్య స్వాతి, తల్లిదండ్రులు భాగ్య, మైసయ్య ఉన్నారు. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు జరుపుతున్నామని పోలీసులు తెలిపారు.

కొనుగోలు కేంద్రంలో గుండెపోటుతో రైతు మృతి



సత్యనారాయణ(ఫైల్)

జమ్మికుంట రూరల్, నవంబరు 24 (ఆంధ్రజ్యోతి): కరీంనగర్ జిల్లా జమ్మికుంట మండలం గండ్రపల్లికి చెందిన గండ్ర సత్యనారాయణ(54) అనే రైతు గ్రామంలోని ఐకేపీ కొనుగోలు కేంద్రంలో సోమవారం గుండె పోటుతో మృతిచెందాడు. గ్రామస్థుల వివరాల ప్రకారం... గ్రామానికి చెందిన సత్యనారాయణ తనకు ఉన్న నాలుగు ఎకరాల వ్యవసాయ భూమిలో వరి సాగు చేశాడు. నాలుగు రోజుల క్రితం గ్రామంలోని ఐకేపీ కొనుగోలు కేంద్రానికి ధాన్యం అమ్మేందుకు తెచ్చాడు. కేంద్రం నిర్వాహకులు ధాన్యం ఎంపిక చేసి సంచులు ఇచ్చారు. కొన్ని గంటల్లో ధాన్యం అమ్ముకొని ఇంటికి వెళ్దామనుకునే లోపు ఒక్కసారిగా గుండెపోటు రావడంతో కుప్పకూలిపోయాడు. సత్యనారాయణకు భార్య, కుమారుడు, కుమార్తె ఉన్నారు. కేసు దర్యాప్తు చేస్తున్నట్లు పట్టణ సీఐ రామకృష్ణగౌడ్ తెలిపారు.

వ్యవసాయ బావిలో పడి ఒకరి మృతి



నారాయణ(ఫైల్)

తిమ్మాపూర్, నవంబరు 24 (ఆంధ్రజ్యోతి): మండలంలోని రేణికుంటలో కనుకుంట నారాయణ(60) వ్యవసాయ బావిలో పడి మృతి చెందాడు. పోలీసులకు ఇచ్చిన ఫిర్యాదు మేరకు.. కనుకుంట నారాయణకు భార్య, ముగ్గురు సతానం. ఆదివారం రాత్రి ఇంట్లో నిద్రించాడు. ఇంట్లో వాళ్లు ఉదయం లేచి చూసేసరికి గదిలోలేకపోవడంతో పొలం వద్దకు వెళ్లినట్టు భావించారు. సోమవారం ఉదయం 9గంటలైనా ఇంటికి రాకపోవడంతో గ్రామంలో వెతికారు. గ్రామానికి చెందిన మంగలి లచ్చయ్య తనకు రాత్రి 10గంటలకు నారాయణ పొలం వద్దకు వెళ్తున్నట్లు కలిసి చెప్పాడని తెలిపాడు. దీంతో పొలం వద్ద వెతుకుతుండగా పెసరి చంద్రయ్య అనేవ్యక్తి వ్యవసాయ బావిలో నారాయణ మృతిచెంది కనిపించాడు. ఎల్ఎండీ పోలీసులు నారాయణ మృతదేహాన్ని ప్రభుత్వాస్పత్రికి తరలిం చారు. తనతండ్రి నారాయణకు కళ్లు సరిగా కనిపించక ప్రమాద వశాత్తు కాలుజారి బావిలో పడిపోయినట్లు ఇచ్చిన ఫిర్యాదుతో కేసు దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ సదన్ కుమార్ తెలిపారు.

ప్రమాదవశాత్తు చెరువులో పడి వృద్ధుడి మృతి

వీణవంక, నవంబరు 24 (ఆంధ్రజ్యోతి): మండలంలోని చల్లూరు గ్రామానికి చెందిన రామిడి మల్లారెడ్డి(74) అనే వృద్ధుడు ప్రమాదవశాత్తు మల్లరికుంట చెరువులోపడి మృతిచెందాడు. పోలీసుల వివరాల ప్రకారం.. మల్లారెడ్డి గేదెలు మేపేందుకు వెళ్లి రాత్రి ఇంటికి రాలేదు దీంతోగ్రామంలో వెతకగా ప్రమాదవశాత్తు మల్లరికుంట చెరువులోపడి మృతిచెందినట్టు గుర్తించారు. మల్లారెడ్డి భార్య రామిడి లక్ష్మి ఫిర్యాదుతో కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తిరుపతి తెలిపారు.

హైదరాబాద్‌లో బుజునూర్ వాసి మృతి



వెంకట్‌రెడ్డి(ఫైల్)

ఇల్లందకుంట, నవంబరు 24 (ఆంధ్రజ్యోతి): మండలంలోని బుజునూర్ గ్రామానికి చెందిన కటంగూరి వెంకట్‌రెడ్డి(60) హైదరా బాద్‌లో జరిగిన రోడ్డు ప్రమాదంలో సోమవారం మృతి చెందినట్లు గ్రామస్థులు తెలిపారు. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. కటంగూరి వెంకట్‌రెడ్డి, లత దంపతులకు ఇద్దరు కూమార్తెలున్నారు. ఒకరు బెంగుళూరులో, మరొకరు హైదరాబాద్‌లో ఉంటున్నారు. ఇటీవల హైద్రాబాద్‌లో ఉంటున్న కూతురు ఇంటికి వెంకట్‌రెడ్డి, లత దంపతులు వెళ్లారు. తిరిగి ఇంటికి వచ్చేందుకు సోమవారం ఉదయం బయలుదేరారు. రోడ్డు దాటుతున్న సమయంలో ఇద్దరినీ ఓ వ్యాన్ వేగంగా ఢీకొంది. తీవ్రంగా గాయపడ్డ వెంకట్‌రెడ్డి అక్కడికక్కడే మృతిచెందగా లతకు తీవ్ర గాయాలయ్యాయి.

బావిలో దూకి యువకుడి ఆత్మహత్య

జ్యోతినగర్, నవంబరు 24 (ఆంధ్రజ్యోతి): ఎన్టీపీసీ పోలీస్‌స్టేషన్ పరిధిలోని కాజిపల్లిలో బైరి రాజేష్(30) అనే యువకుడు సోమవారం బావిలో దూకి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. మల్యాలపల్లికి చెందిన రాజేష్ రాజుపల్లికి చెందిన యువతితో ఐదేళ్ల క్రితం వివాహం జరిగింది. అతను భార్యతో కలిసి సమీపంలోని మాతంగి కాలనీలో నివాసం ఉంటున్నాడు. ఈ క్రమంలో రాజుపల్లిలోని అత్తగారి ఇంటి బావిలో దూకి ఆత్మహత్య చేసుకున్నాడు. ఆత్మహత్యకు గల కారణాలు తెలియాల్సి ఉంది. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

ఘనంగా మల్లన్న దేవాలయం ధ్వజస్థంభం ప్రతిష్ఠాపన



ధ్వజ స్థంభం ప్రతిష్ఠాపనలో పాల్గొన్న గ్రామస్థులు

ఇబ్రహీంపట్నం, నవంబరు 24 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని మల్లన్న దేవాలయంలో సోమవారం నూతన ధ్వజస్థంభం ప్రతిష్ఠాపన మహోత్సవ కార్యక్రమాన్ని వేదపండితులు, గ్రామస్తులు అత్యంత భక్తి శ్రద్ధలతో నిర్వహించారు. మల్లన్న స్వామికి ప్రత్యేకపూజలు చేయగా, భక్తులు మంగళహారతులతో మల్లన్నను కీర్తించారు. వేదపండితులు మంత్రోచ్చారణల మధ్య ధ్వజస్థంభం ప్రతిష్ఠించారు. ఈవేడుకల్లో దేవాలయ కమిటీసభ్యులు, భక్తులు, గ్రామస్థులు పాల్గొన్నారు.

ఆహార ఉత్పత్తి అభివృద్ధే లక్ష్యం

● నిరుద్యోగ యువత, సంఘాలకు వరం.. పీఎంఎఫ్ఎంఈ పథకం

● పరిశ్రమల ఏర్పాటుకు సబ్సిడీ రుణం



ఆహార ఉత్పత్తి, తయారీ రంగాల్లో నాణ్యత ప్రమాణాలను అభివృద్ధి చేయడమే లక్ష్యంగా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు సంయుక్తంగా పీఎంఎఫ్ఎంఈ పథకాన్ని నిర్వహిస్తున్నాయి. ఫుడ్ ప్రాసెసింగ్ యూనిట్లను స్థాపించే యువత, స్వశక్తి సంఘాలకు 30 లక్షల రూపాయల వరకు రుణాలను అందజేసి 35 శాతం వరకు సబ్సిడీని అందజేసే ఈ పథకాన్ని ఎంవోఎఫ్‌పీఐ (మినిస్ట్రీ ఆఫ్ ఫుడ్ ప్రాసెసింగ్ ఇండస్ట్రీస్) రూపొందించింది. ఫుడ్ ప్రాసెసింగ్ యూ నిట్లను బలోపేతం చేస్తూ ఉత్పత్తులను మార్కెటింగ్, మౌలిక సదుపాయాలను ఈ పథకం కల్పిస్తుంది. పరిశ్రమల సామర్థ్యం, అభివృద్ధికి కావాల్సిన సాంకేతికతను అందజేస్తుంది. బ్యాంకుల ద్వారా రుణాలను అందజేస్తూ యూనిట్ల స్థాపనకు కృషి చేస్తుంది.

- చొప్పదండి, (ఆంధ్రజ్యోతి)

● **30 లక్షల వరకు రుణ సదుపాయం...**

పీఎంఎఫ్ఎంఈ పథకం కింద ఆహార ఉత్పత్తుల(ఫుడ్ ప్రాసెసింగ్) యూనిట్ల స్థాపనకు వ్యక్తులు, స్వయం సహాయక గ్రూపులు దరఖాస్తు చేసుకోవాల్సి ఉంటుంది. యూనిట్లకు లక్ష రూపాయల నుంచి 30 లక్షల వరకు బ్యాంకులు రుణాన్ని అందజేస్తాయి. 35 శాతం సబ్సిడీని 10 లక్షలకు మించకుండా అందజేస్తారు. పెద్ద పరిశ్రమకు 10 కోట్ల రూపాయల వరకు రుణాన్ని మూడు కోట్ల వరకు సబ్సిడీని అందజేస్తారు. ఎఫ్‌పీవోలు, ఎస్‌హెచ్‌జీలు, సహకార సంఘాలు, ప్రభుత్వ ఏజెన్సీలు, పెద్ద పరిశ్రమలు పెట్టేందుకు అర్హులు కాగా, పరిశ్రమల పెట్టుబడిలో 10 శాతం వాటాను చెల్లించాల్సి ఉంటుంది.



పీఎంఎఫ్ఎంఈ బ్రోచర్

● **యూనిట్‌కు రుణ సదుపాయం...**

బేకరీకి 10 లక్షలు, హోం ఫుడ్స్, పచ్చళ్లు, పాపడ్ తయారీకి 5 లక్షలు, రైస్ మిల్ ఏర్పాటుకు 50 లక్షల రుపాయలు అందజేస్తారు. మొబైల్ రైస్ మిల్‌కు 10 లక్షలు, గానుగ నూనె యూనిట్‌కు 8 లక్షల నుంచి 10 లక్షలు, మసాల ప్యాకింగ్ యూనిట్‌కు 4 లక్షల నుంచి 6 లక్షలు ఇస్తారు. దాల్ మిల్స్‌కు 10 లక్షల నుంచి 15 లక్షలు, స్వీట్ హౌస్ ఏర్పాటుకు 3 లక్షలు, పల్లిపట్టి యూనిట్‌కు 10 లక్షల నుంచి 20 లక్షలు, ఇన్‌స్టంట్ ఫుడ్స్ తయారీకి 10 లక్షల నుంచి 20 లక్షలు, ఫ్లోర్ మిల్లుల ఏర్పాటుకు 2 లక్షల నుంచి 5 లక్షల వరకు రుణాలు అందజేస్తారు. దరఖాస్తులను pmfme.mofpi.gov.in వెబ్‌సైట్‌లో దాఖలు చేయాలి.

రాష్ట్రస్థాయి వాలీబాల్ పోటీలకు విద్యార్థిని ఎంపిక



సాత్విక

సుల్తానాబాద్, నవంబరు 24 (ఆంధ్రజ్యోతి): నందిమేడారంలో ఈనెల 26న జరిగే రాష్ట్రస్థాయి వాలీబాల్ పోటీలకు గర్రెపల్లి జడ్పీ ఉన్నత పాఠశాలకు చెందిన విద్యార్థిని సాత్విక ఎంపికైంది. గర్రెపల్లి ప్రభుత్వ పాఠశాలలో 9వతరగతి చదువుతున్న సాత్విక జిల్లాస్థాయి పోటీల్లో చక్కని ప్రతిభను కనబరిచి రాష్ట్రస్థాయికి ఎంపికైనట్లు వ్యాయామ ఉపాధ్యాయులు ఆసియా తెలిపారు. సాత్వికను ప్రధానోపాధ్యాయులు కవిత, ఉపాధ్యాయబృందం అభినందించారు.

గంజాయి పట్టివేత

బుగ్గారం, నవంబరు 24 (ఆంధ్రజ్యోతి): బుగ్గారం మండలం గోపులాపూర్ గ్రామంలో సోమవారం పల్లెప్రకృతి వనం వద్ద గంజాయి తాగుతున్న ఇద్దరు యువకులను ఎస్సై సతీష్ పట్టుకున్నారు. గంజాయి తాగుతున్న బీహార్ రాష్ట్రానికి చెందిన కగారియా జిల్లాకు చెందిన సురాజ్‌కుమార్, రాహుల్‌కుమార్ వద్ద నుంచి 60గ్రాముల గంజాయి స్వాధీనంచేసుకొని కేసు నమోదు చేసినట్లు సతీష్‌కుమార్ తెలిపారు. ఈ సందర్భంగా ఎస్ఐ మాట్లాడుతూ గంజాయి తాగినా, అమ్మినా కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

ఎస్టీ గురుకుల కళాశాల కార్యాలయానికి తాళం

● 8నెలలుగా అద్దె ఇవ్వడం లేని యజమాని ఆవేదన

మంథని, నవంబరు 24 (ఆంధ్రజ్యోతి): స్థానిక ప్రభుత్వ గిరిజనబాలికల జూనియర్ కళాశాల అద్దె భవనంలోని ఆఫీసు రూంకు భవన యజమాని మురళీధర్‌రెడ్డి సోమవారం తాళం వేశారు. తనకు 8 నెలలుగా అద్దె చెల్లించకుండా, ఖాళీ చేయకుండా ఇబ్బందులకు గురి చేస్తున్నారని ఆయన ఆరోపించారు. అద్దె విషయంలో అధికారులకు ఎన్నిసార్లు చెప్పిన నిర్లక్ష్యంగా వ్యవహరిస్తుండటంతో చివరకు తాళం వేయాల్సి వచ్చింది వాపోయారు. ఈ విషయం తెలుసుకున్న ప్రజా సంఘాల నేతలు బూడిద గణేష్, మంథని లింగన్న, బాబు, రవిలు అక్కడి చేరుకొని భవన యజమానితో చర్చించారు. భవనానికి తాళం వేయడం ద్వారా విద్యార్థుల విద్యకు, భోజన, వసతికి ఇబ్బందులు ఏర్పడుతాయని సూచించడంతో యజమాని శాంతించారు. ప్రజా సంఘాల నేతలు ఈ విషయాన్ని ఆర్డీవో, తహసీల్దార్ దృష్టికి తీసుకెళ్ళడంతో డీటీ, ఆర్ఐలు అక్కడికి చేరుకొని జరిగిన ఇబ్బందిని రికార్డు చేసుకున్నారు. అనంతరం ఆర్డీవో సురేష్ యజమానికి మురళీధర్‌రెడ్డిని పిలిపించుకొని అద్దె చెల్లింపు విషయాన్ని ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్తామని చెప్పారు. దీంతో ఆయన ఆఫీసు రూంకు వేసిన తాళం తీశారు.

మైనార్టీ గురుకుల పాఠశాల ఎదుట..

విద్యార్థుల ఆందోళన

● కనీస సౌకర్యాలు కల్పించాలని డిమాండ్



జగిత్యాలలో మైనార్టీ పాఠశాల ఎదుట ధర్నా చేస్తున్న విద్యార్థులు

జగిత్యాల అగ్రికల్చర్, నవంబరు 24 (ఆంధ్రజ్యోతి): కనీస వసతులు కల్పించాలని జగిత్యాలలోని ఖిలాగడ్డ మైనార్టీ పాఠశాల ఎదుట విద్యార్థులు సోమవారం ఆందోళన చేశారు. ఈ సందర్భంగా విద్యార్థులు మాట్లాడుతూ తమ పాఠశాలలో ల్యాబ్, లైబ్రరీ సదుపాయం లేదని, గ్రౌండ్ కూడా లేకపోవడంతో పాటు ఇతర సమ స్యలతో తాము ఇబ్బందులు పడుతు న్నామని ఆవేదన వ్యక్తం చేశారు. ఇన్‌చార్జి ప్రిన్సిపాల్ రవి వైఖరి తమకు ఆవేదన కలిగించిందని ఆయనపై ఉన్నతాధి కారులు చర్యలు తీసుకోవాలని వారు విజ్ఞప్తి చేశారు. ఈవిషయమై ఇన్‌చార్జి ప్రిన్సిపాల్ రవిని వివరణ కోరగా మందలించే క్రమంలో ఇబ్బంది జరిగిందని భావిస్తున్నామని, మరోమారు ఇలాంటివి జరగకుండా చూసుకుంటామని ఆయన వెల్లడించారు. అనంతరం మైనార్టీ నాయకులు, పాఠశాల ఉపాధ్యాయులు విద్యార్థులను సముదాయించడంతో వారు ఆందోళన విరమించారు.

హత్య కేసులో నిందితుడి రిమాండ్



నిందితుడిని అరెస్టు చూపుతున్న రూరల్ సీఐ ఏ నిరంజన్‌రెడ్డి

కరీంనగర్ క్రైం, నవంబరు 24 (ఆంధ్రజ్యోతి): మొగ్దుంపూర్ శివారులోని ఇటుక బట్టీల్లో ఇటీవల ఒడిస్సాకు చెందిన కార్మికుడు సూరజ్‌కుంబార్(45) అనుమానాస్పదస్థితిలో మృతిచెందగా పోలీసులు సోమవారం నిందితుడిని పట్టుకుని రిమాండ్ చేశారు. కరీంనగర్ రూరల్‌సీఐ నిరంజన్‌రెడ్డి సోమవారం ఈ కేసుకు సంబంధించిన వివరాలను విలేకరులకు వెల్లడించారు. ఒడిస్సా జర్సుగూడ జిల్లాకు చెందిన సూరజ్ కుంబార్ కొన్నిరోజుల కిందట దుర్గగార్దియా మరికొందరితో కలిసి మొగ్దుంపూర్ ఇటుకబట్టీల్లో పని చేసేందుకు వచ్చాడు. దుర్గగార్దియా అదే ఇటుక బట్టీలో పనిచేస్తున్న ఒక మహిళతో చనువుగా ఉండడాన్ని సూరజ్‌కుంబార్ గమనించాడు. సూరజ్ కుంబార్ గమనిస్తున్నాడని తెలుసుకున్న దుర్గ గార్దియా అతడిపై కోపం పెంచుకున్నాడు. దుర్గగార్దియా నవంబరు 8న అర్ధరాత్రి సూరజ్‌కుంబార్ ఉన్న గదిలోకి వెళ్లి సూరజ్‌ను ఛాతి, కడుపు, పొత్తికడుపులో బలంగా తన్నడంతో స్పృహ తప్పి పడిపోగా అక్కడే వదిలేసి వెళ్లిపోయాడు. మరుసటిరోజు మిగతా వారితో కలిసి వచ్చి చూశాడు. కార్మికులు వెంటనే ఇటుకబట్టీల యజమానికి సమాచారం ఇవ్వగా ఆయన 108అంబులెన్స్‌కు ఫోన్ చేశాడు. సూరజ్ కుంభార్‌ను చూసి అప్పటికే చనిపోయాడని 108 సిబ్బంది తెలిపారు. సూరజ్ కుంభార్ మద్యం తాగి ఆహారం తీసు కోనం దున సహజంగా చనిపోయినట్లు ఉన్నాడని తోటికార్మికులతో దుర్గ గార్దియా చెప్పి యజమాని తెప్పించిన అంబులెన్స్‌లో మృతదేహాన్ని ఒడిసాకు తీసుకెళ్లారు. అక్కడికి వెళ్లిన తర్వాత కుటుంబసభ్యులు సూరజ్ సహజంగా చని పోలేదని, ఎవరో చంపి ఉంటారని అక్కడి పోలీసులకు ఫిర్యాదు చేశారు. అక్కడి పోలీసులు మృతదేహానికి పోస్టుమార్టం చేయించగా సూరజ్ శరీరం లోపలిభాగంలో బలమైన గాయాలు తగిలి చనిపోయినట్లు వెల్లడైంది. వెంటనే కేసు నమోదుచేసి కరీంనగర్‌కు ట్రాన్స్‌ఫర్ చేశారు. కరీంనగర్‌రూరల్ పోలీసులు ఇక్కడ కేసు నమోదుచేసి విచారణ జరుపగా దుర్గా గార్దియనే హత్య చేశాడని వెల్లడైంది. దుర్గా గార్దియాను సోమవారం బొమ్మకల్ గ్రామంలోని గుంటూరుపల్లి వద్ద పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. విచారించగా తాను కొట్టిన దెబ్బలతో సూరజ్ చనిపోయినట్లు దుర్గా గార్దియా నేరం ఒప్పుకున్నాడు. సమావేశంలో ఎస్ఐ నరేష్, అంజద్ పాల్గొన్నారు.

ఇసుక ట్రాక్టర్లు పట్టివేత

మెట్‌పల్లి రూరల్, నవంబరు 24 (ఆంధ్రజ్యోతి) : అక్రమంగా ఇసుక తరలిస్తున్న మూడుట్రాక్టర్లను పట్టుకున్నట్లు తహసీల్దార్ నీత తెలిపారు. కథలపూర్ మండలంనుంచి రాత్రివేళల్లో ఇసుకను తరలిస్తూ మండలంలోని రామలచ్చక్కపేట గ్రామశివారులో అక్రమంగా నిల్వచేసి ఉదయం ఇతర ప్రాంతాలకు రవాణా చేస్తున్నారని సమాచారం రావడంతో సోమవారం రెవెన్యూ అధికారులు తనిఖీలు చేపట్టారు. ఈతనిఖీల్లో రామలచ్చక్కపేట, మెట్లచిట్టాపూర్ గ్రామాలమధ్య కోతకు గురైన వరదకాలువ నుంచి అక్రమంగా ఇసుక తరలిస్తుండగా వెల్లుల్ల గ్రామశివారులో మూడుట్రాక్టర్లను పట్టుకుని మెట్‌పల్లి తహసీల్దార్ కార్యాలయానికి తరలించినట్లు అధికారులు తెలిపారు. ఈ సందర్భంగా తహసీల్దార్ నీత మాట్లాడుతూ నిబంధ నలు అతిక్రమించి అక్రమంగా ఇసుకను తరలిస్తే చట్టపరమైన చర్యలు తప్పవన్నారు.

ఇబ్రహీంపట్నం: అక్రమంగా ఇసుకను తరలిస్తున్న రెండు ట్రాక్టర్లను పట్టుకున్నట్లు తహసీల్దార్ వరప్రసాద్ తెలిపారు. మల్లాపూర్ మండలం వాల్గొండ గ్రామంనుంచి మండలంలోని యామపూర్ గ్రామానికి ఇసుకను అనుమతులు లేకుండా తరలిస్తున్న ట్రాక్టర్‌ను పట్టుకున్నామన్నారు. మరో ట్రాక్టర్‌ను నిజా మాబాద్ జిల్లా భట్టాపూర్ నుంచి మండలంలోని కోమటి కొండాపూర్‌గ్రామానికి తరలిస్తుండగా పట్టుకున్నట్లు తహసీల్దార్ పేర్కొన్నారు. ఒక్కొక్కరికి రూ.10వేలజరిమానా విధించినట్లు తెలిపారు.

బంగారం చోరీ

వీణవంక, నవంబరు 24 (ఆంధ్రజ్యోతి): మండలంలోని కనపర్తి గ్రామానికి చెందిన కొయ్యడ మధునమ్మ ఇంట్లో పావు తులం బంగారం దొంగలు ఎత్తుకెళ్లారు. పోలీసులు వివరాల ప్రకారం.. మధునమ్మ కూలి పనులకు వెళ్లి వచ్చేసరికి ఇంటి తాళం పగలగొట్టి ఉంది. బీరువాలోని వస్తువులు చిందర వందరగా పడేశారు. బియ్యం డబ్బాలో దాచుకున్న పావుతులం బంగారం దొంగలు ఎత్తుకెళ్లారు. కేసు దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్సై తిరుపతి తెలిపారు.

గవర్నర్‌కు ఎస్‌యూ వైస్ చాన్సలర్ కృతజ్ఞతలు



గవర్నర్‌ను కలసి కృతజ్ఞతలు తెలుపుతున్న ఎస్‌యూ వీసీ యు.ఉమేష్‌కుమార్

గణేశ్‌నగర్, నవంబరు 24 (ఆంధ్రజ్యోతి): గవర్నర్, విశ్వవిద్యాలయ కులపతి జిష్ణుదేవ్ వర్మకు శాతవాహన విశ్వవిద్యాలయం ఉపకులపతి ప్రొఫెసర్ ఉమేష్‌కుమార్ కృతజ్ఞతలు తెలిపారు. ఎస్‌యూ రెండో స్నాతకోత్సవానికి హాజరైన సందర్భంగా సోమవారం హైదరాబాద్‌లో కలిసి జ్ఞాపికను అందజేశారు. ఈ సందర్భంగా గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ మాట్లాడుతూ స్నాతకోత్సవ ఏర్పాట్లు అద్వితీయంగా ఉన్నాయని కితాబిచ్చారు.

రోడ్డు ప్రమాదంలో ఇద్దరికి తీవ్ర గాయాలు

తంగళ్లపల్లి, నవంబరు 24 (ఆంధ్రజ్యోతి): తంగళ్లపల్లి మండల కేంద్రంలో ద్విచక్రవాహనాన్ని కారు ఢీకొట్టడంతో ఇద్దరు తీవ్రంగా గాయ పడ్డారు. మండలకేంద్రానికి చెందిన రఘునందన్, పర్శరాములు ద్విచక్రవాహనంపై వెళ్తుండగా కారుఢీకొట్టింది. దీంతో ద్విచక్ర వాహనంపై ఉన్న ఇద్దరు తీవ్రంగా గాయపడ్డారు. గమనించిన స్థానికులు వెంటనే వారిని 108 వాహనంలో జిల్లా కేంద్రంలోని ప్రధాన ఆసుపత్రికి తరలించారు.

పారితోషికం అందేదెన్నడో..?

● కుటుంబ సర్వే డేటా ఎంట్రీ ఎన్యూమరేటర్ల ఎదురుచూపులు ● ఏడాదైనా అందని భత్యం



కుటుంబ సర్వే డాటా ఎంట్రీ చేస్తున్న ఆపరేటర్లు(ఫైల్)

మల్యాల, నవంబరు 24 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం గతేడాది నవంబరులో చేపట్టిన సామాజిక, ఆర్థిక, విద్య, ఉపాధి, రాజకీయ మరియు కుల సర్వే డేటా ఎంట్రీ చేసిన ఎన్యూమరేటర్లకు ఏడాదిగా తమకు చెల్లించాల్సిన బకాయిల కోసం ఎదురు చూస్తున్నారు. మల్యాల మండల వ్యాప్తంగా అధికారులు చేసిన ఇంటింట కుటుంబ సర్వే డేటాను 122మంది ఎన్యూమరేటర్లు ఇరవై వేలకు పైగా సర్వే వివరాలు ఆన్‌లైన్‌లో ఎంట్రీ చేశారు. గ్రామ పంచాయతీ కార్యాలయాలు, నాచుపల్లి జేఎన్‌టీయూ కళాశాలలో అక్కడి విద్యార్థులు మండలంలోని పలువురు యువతీయువకులు వివరాలు నమోదు చేశారు. అయితే వారికి ఎంట్రీ పూర్తి కాగానే చెల్లించాల్సిన పారితోషికంను చెల్లించకపోవడంతో ఏడాది కాలంగా జిల్లా ఉన్నతాధికారులకు, ప్రజావాణిలో తమ విన్నపాలు వినిపిస్తూనే ఉన్నారు. అయితే వారి విన్నపాలు పట్టించుకోవడం లేదు.

● **ఒక్కో ఎంట్రీకి రూ.30**

సమగ్ర కుటుంబ సర్వేకు సంబంధించి ఒక్కో ఎంట్రీకి రూ.30 చెల్లించనున్నట్లు అధికారులు పేర్కొనడంతో పదుల సంఖ్యలో ఎన్యూమరేటర్లు ముందుకు వచ్చి డాటా ఆన్‌లైన్ చేశారు. మల్యాల మండలమే కాకుండా ఇతర మండలాలకు చెందిన వాటి సర్వే వివరాలను నమోదు చేయగా ఒక్కోక్కరికి కనీసం రూ.పది వేల నుంచి ఇరవై వేలకు ప్రభుత్వం నుంచి రావాల్సి ఉంది. వెంటనే తమకు డబ్బులు చెల్లించాలని ఎన్యుమరేటర్లు కోరుతున్నారు.

● **త్వరగా చెల్లించాలి**

- రుత్త గంగాధర్, ఎన్యూమరేటరు, మల్యాల

గత ఏడాది నవంబరు 30 నాటికి తాము డాటా ఎంట్రీ పూర్తి చేయగా అప్పటి నుంచి తమకు చెల్లిస్తామన్న డబ్బులు రాలేదు. అధికారుల దృష్టికి తీసుకెళ్లినప్పటికీ వారి నుంచి ఎలాంటి స్పందన లేదు. ఇప్పటికైన తమకు ఎంట్రీకి సంబంధించిన సొమ్ములు వెంటనే చెల్లించాలి.

మత్స్యకార రాష్ట్ర మహాసభలను

విజయవంతం చేయండి

సుభాష్‌నగర్, నవంబరు 24 (ఆంధ్రజ్యోతి): తెలంగాణ మత్స్యకారులు, మత్స్యకార్మికుల సంఘం 4వ రాష్ట్ర మహాసభలను విజయవంతం చేయాలని సంఘం నాయకులు పిలుపునిచ్చారు. సోమవారం కలెక్టరేట్ ఆవరణలో విలేకరులతో మాట్లాడారు. జిల్లా కేంద్రంలోని రెవెన్యూ గార్డెన్‌లో ఈ నెల 25 నుంచి 27 వరకు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. కేరళ ఫిషరీస్ కార్పొరేషన్ ఛైర్మన్ స్టాన్లీ, రాష్ట్ర మత్స్యశాఖ మంత్రి వాకాటి శ్రీధర్, రవాణా బీసీ సంక్షేమశాఖ మంత్రి పొన్నం ప్రభాకర్‌ను ఆహ్వానించినట్లు చెప్పారు. రాష్ట్రంలో మత్స్యవృత్తిపై ఆధారపడి సుమారు 10 లక్షల కుటుంబాలు ఉపాధి పొందుతున్నాయని, 5,650 మత్స్య సహకార సంఘాల్లో 5 లక్షల 40 వేల మంది సభ్యులుగా ఉన్నారని అన్నారు. రాష్ట్రంలో కృష్ణ, గోదావరి నదులతోపాటు అనేక ఉప నదులు, 42 వేల చెరువులు, కుంటలు, 62 రిజర్వాయర్లు, సుమారు 7 లక్షల హెక్టార్లలో విస్తారమైన జలవనరులు ఉన్నాయన్నారు. తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన తరువాత భూముల ధరలు విపరీతంగా పెరిగాయని, రియల్ ఎస్టేట్ మాఫియా, అధికార, ప్రతిపక్ష రాజకీయ దళారీలు పెద్ద ఎత్తున చెరువులు, కుంటలను కబ్జా చేస్తున్నారని ఆరోపించారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు రానున్న బడ్జెట్‌లో మత్స్య వృత్తి రక్షణ-మత్స్యకారుల సంక్షేమానికి రూ. 5,000 కోట్లు కేటాయించాలని, మత్స్యకారుల భద్రతకు ఇన్సూరెన్స్, ఎక్స్‌గ్రేషియాను రూ.20లక్షలకు పెంచాలని డిమాండ్ చేశారు. సమావేశంలో ఉమ్మడి రాష్ట్ర మాజీ ఛైర్మన్ చేతి ధర్మయ్య, సంఘం రాష్ట్ర ప్రధానకార్యదర్శి లెల్లెల బాలకృష్ణ, జిల్లా అధ్యక్షుడు పిట్టల వెంకటేష్, ప్రధానకార్యదర్శి గణేశ్, కోశాధికారి పప్పు సదానందం, రమేశ్ తదితరులు పాల్గొన్నారు.

ట్రాక్టర్ ప్రమాదంలో మహిళకు గాయాలు

ధర్మారం, నవంబరు 24 (ఆంధ్రజ్యోతి): పొలం పనికి వెళ్లిన మహిళ నిలువ నీడ కోసం ట్రాక్టర్ క్రింద కూర్చోగా, గమనించని డ్రైవర్ ట్రాక్టర్ తీయడంతో మహిళకు గాయలయ్యాయి. మండలంలోని మల్లాపూర్ గ్రామానికి చెందిన దీకొండ సుగుణ వారి వ్యవసాయ పనుల నిమిత్తం పొలం వద్దకు వచ్చింది. ఎండ తీవ్రత ఎక్కువ ఉండడంతో కాసేపు సేదతీరడం కోసం పొలంలోని ట్రాక్టర్ ట్రాలీకింద కూర్చుంది. మహిళను గమనించని డ్రైవర్ ట్రాక్టర్ తీయగా సుగుణ కాలు విరిగింది. సమా చారం అందుకున్న 108సిబ్బంది చికిత్స నిమిత్తం ఆమెను కరీంనగర్ ఆసుపత్రికి తరలించారు.

ఇందిరమ్మ లబ్ధిదారులకు

రుణ సౌకర్యం

- స్వయం సహాయక సంఘాల ద్వారా రూ. రెండులక్షల వరకు..
- సంఘంలో తీర్మానం తప్పనిసరి



కరీంనగర్ రూరల్ మండలంలో పునాది దశలో ఉన్న ఇందిరమ్మ ఇళ్లు, బహదూర్‌ఖాన్ పేటలో నిర్మిస్తున్న ఇందిరమ్మ ఇళ్లు

కరీంనగర్ రూరల్, నవంబరు 24 (ఆంధ్రజ్యోతి): పేదల సొంతింటి కలను సాకారం చేసేందుకు ప్రభుత్వం ఇందిరమ్మ ఇళ్ల పథకాన్ని అమలు చేస్తోంది. ఈ పథకానికి ఎంపికైన లబ్ధిదారులకు నాలుగు విడతల్లో ఐదు లక్షల రూపాయలను ప్రభుత్వం అందజేస్తుంది. పునాది పూర్తయితేనే ప్రభుత్వం మొదటి విడత నిధులు మంజూరు చేస్తుంది. లబ్ధిదారుల్లో పేదలే అధికంగా ఉండడంతో ఇంటి నిర్మాణానికి డబ్బులు లేక ఇబ్బందులు పడుతున్నారు. ఇలాంటి వారికి స్వయం సహాయక సంఘాల ద్వారా 50 వేల నుంచి రెండు లక్షల రూపాయల వరకు రుణం అందజేస్తున్నారు. దీంతో పేద, మధ్య తరగతి ప్రజలకు ఊరట కలుగుతోంది. కరీంనగర్ రూరల్ మండలంలో 14 గ్రామాల్లో 1,164 ఇందిరమ్మ ఇళ్లు మంజూరు కాగా వివిధ కారణాల వల్ల 22 రద్దయ్యాయి. ప్రస్తుతం 1,142 ఇళ్లకు గాను 546 ఇళ్లకు ముగ్గులు పోశారు. పునాదుల వరకు 50 ఇళ్లు, రూఫ్ లెవల్ వరకు ఆరు ఇళ్లు పూర్తయ్యాయి. 37 ఇళ్లకు స్లాబ్ వేశారు. ఇందులో స్వయం సహాయక సంఘంలో సభ్యులైన 106 మంది లబ్ధిదారులకు ఇళ్ల నిర్మాణానికి 1.06 కోట్ల రూపాయల రుణం అందించారు. ఇల్లు మంజూరై, మహిళా సంఘంలో సభ్యులైన వారు మాత్రమే రుణానికి అర్హులు. అవసరమైన వారు మహిళా సంఘంలో తీర్మానం చేయించి సంబంధిత ఏపీఎం, సీసీలను కలిస్తే బ్యాంకుల ద్వారా రుణం అందించేలా చర్యలు తీసుకుంటారు.

● ఉపాధి హామీ తోడ్పాటు

ఇళ్ల నిర్మాణానికి సంబంధించి రుణాలే కాకుండా ఉపాధి హామి పథకం ద్వారా ప్రభుత్వం తోడ్పాటు అందిస్తోంది. లబ్ధిదారుల ఆర్థిక సమస్యలు, కూలీల కొరత తదితర ఇబ్బందులను దృష్టిలో పెట్టుకుని ఈ చర్యలు తీసుకుంటోంది. ఉపాధి హామి జాబ్ కార్డు ఉండి ఇందిరమ్మ ఇళ్ల పథకంలో లబ్ధిదారులైన వారికి 90 రోజుల హాజరు వేస్తారు. ఈ పని దినాలకు సంబంధించిన 27 వేల రూపాయలను లబ్ధిదారుల ఖాతాల్లో జమ చేస్తారు. పునాది నిర్మాణం నుంచి స్లాబ్ పూర్తయ్యే వరకు 90 రోజుల పని దినాలు కల్పిస్తూ లబ్ధిదారులకు ప్రభుత్వం కొంత మేర ఆసరా కల్పిస్తుంది.

తక్కువ వడ్డీతో రుణాలు...

- రామ్మోహన్, ఐకేపీ ఏపీఎం

ఇందిరమ్మ ఇళ్లు నిర్మించుకునే లబ్ధిదారులకు స్వయం సహాయక సంఘాల ద్వారా రుణాలు ఇస్తున్నాము. సంఘంలో సభ్యురాలై ఉండి తీర్మానం చేసి పంపితే నిర్మాణానికి బ్యాంకుల ద్వారా తక్కువ వడ్డీతో రుణాలిస్తున్నాము. లబ్ధిదారులు ప్రతినెలా కిస్తీలను కట్టుకుంటే సరిపోతుంది.

సామాజిక కార్యకర్త

బక్క జడ్సన్‌ను విడుదల చేయాలి



ధర్నా చేస్తున్న రిటైర్డ్ ఎంప్లాయీస్ వెల్ఫేర్ అసోసియేషన్ నాయకులు

గణేశ్‌నగర్, నవంబరు 24 (ఆంధ్రజ్యోతి): సామాజిక కార్యకర్త బక్క జడ్సన్‌ని విడుదల చేయాలని రిటైర్డ్‌ఎంప్లాయీస్ అసోసియేషన్ తెలంగాణ రాష్ట్ర కన్వీనర్ కోహెడ చంద్రమౌళి డిమాండ్ చేశారు. సోమవారం తెలంగాణ చౌక్‌లో ధర్నా చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మార్చి నుంచి రిటైర్డ్ ఉద్యోగుల బకాయిలు చెల్లించాలని గవర్నర్ కార్యాలయంలో మూడుసార్లు మెమోరాండం ద్వారా విన్నవించినా స్పందించకపోవడంతో మరోసారి రాజ్‌భవన్‌కు జడ్సన్ వెళ్లారని, అనుమతించకుండా అరెస్టు చేయడం అన్యాయమని అన్నారు. జిల్లా ప్రధాన కార్యదర్శి సుంకిశాల ప్రభాకర్‌రావు మాట్లాడుతూ 2024మార్చి నుంచి రిటైర్డ్ ఉద్యోగులకు ఉపాధ్యాయుల బకాయిలను చెల్లించని పక్షంలో డిసెంబర్ మొదటివారంలో ఆమరణ నిరాహారదీక్ష చేపడతామన్నారు. సమావేశంలో జిల్లాఉపాధ్యక్షుడు గద్ద జగదీశ్వరాచారి, కోశాధికారి కనపర్తి దివాకర్, బోరుపల్లి రవీందర్, పాలు రవీందర్ తదితరులు పాల్గొన్నారు.

రూ. 8060కే సీసీఐ పత్తి కొనుగోలు

చొప్పదండి, నవంబరు 24 (ఆంధ్రజ్యోతి): బీపీ స్పెషల్ మోడ్ పత్తి ధర క్వింటాల్‌కు 8060 రూపాయలకే కొనుగోలు చేయనున్నట్లు సీసీఐ ప్రకటించిందని మార్కెట్ కార్యదర్శి రాజేశ్వరి ఒక ప్రకటనలో తెలిపారు. రైతులు విషయాన్ని గమనించాలని, పత్తి అమ్మకానికి స్లాట్ బుకింగ్ చేసుకోవాలని పేర్కొన్నారు.

అవినీతిరహిత సమాజం కోసం..

యువత రాజకీయాల్లోకి రావాలి

- రాష్ట్రీయ లోక్‌దళ్ అధ్యక్షుడు, మాజీ ఎమ్మెల్సీ కపిలవాయి దిలీప్‌కుమార్



జగిత్యాలలో మాట్లాడుతున్న రాష్ట్రీయ లోక్‌దళ్ రాష్ట్ర అధ్యక్షుడు దిలీప్ కుమార్

జగిత్యాల అర్బన్, నవంబర్ 24 (ఆంధ్రజ్యోతి): అవినీతి రహిత సమాజం కోసం యువత రాజకీయాల్లోకి రావాలని రాష్ట్రీయ లోక్‌దళ్ రాష్ట్ర అధ్యక్షుడు, మాజీ ఎమ్మెల్సీ కపిలవాయి దిలీప్ కుమార్ పిలుపునిచ్చారు. రాష్ట్రీయ లోక్‌దళ్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న సామాజిక చైతన్య రథయాత్రలో భాగంగా సోమవారం జగిత్యాలలో మీడియా సమావేశాన్ని ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గతంలో పాలించిన బీఆర్‌ఎస్, ప్రస్తుత కాంగ్రెస్‌పార్టీలు తెలంగాణకు ద్రోహం చేశాయని విమర్శించారు. ప్రత్యేకతెలంగాణ ఏర్పడితే రాష్ట్రంలో ఉద్యోగ, ఉపాధి అవకాశాలు మెరుగుపడతాయని భావించిన లక్షలాదిమంది యువత తెలంగాణ ఉద్యమంలో పనిచేశారన్నారు. తెలంగాణ ఏర్పడిన తర్వాత యువత ఆశలు అడియాసలు అయ్యాయని విమర్శించారు. భౌగోళిక తెలంగాణ ఏర్పడిందే తప్ప సామాజిక తెలంగాణ ఏర్పడలేదన్నారు. విద్య, వైద్యం, ఉపాధివంటి కీలక వ్యవస్థలు పూర్తిగా దెబ్బతిన్నాయని ఆయన ఆరోపించారు. ఇప్పటికి కనీసం రెండు లక్షల ఉద్యోగాలు భర్తీ చేయాల్సి ఉందని, 28లక్షల మంది యువతకు వృత్తి నైపుణ్య శిక్షణ పూర్తి చేయాల్సి ఉన్నప్పటికీ ఆ దిశగా కృషి చేయడంలో రాష్ట్రప్రభుత్వం పూర్తిగా విఫలమైందన్నారు. ఎస్సీ, ఎస్టీ, బీసీ వర్గాల ఐక్యతతోనే బహుజనులకు రాజకీయ అధికారం వస్తుందని ఆ దిశగా రాష్ట్రీయ లోక్‌దళ్ పార్టీ కృషి చేస్తుందన్నారు. యువతను రాజకీయాల్లోకి ఆహ్వానించడంతో పాటు వారికి ఉపాధి కల్పించే విషయంలో తమపార్టీ తెలంగాణలోని అన్ని జిల్లాలలో జాబ్ మేళాలను నిర్వహించి ఉద్యోగ, ఉపాధిఅవకాశాలు కల్పిస్తుందని తెలిపారు. వచ్చే స్థానికసంస్థల ఎన్నికల్లో తమపార్టీ ఆధ్వర్యంలో యువతకు ఎక్కువ సీట్లు కేటాయించి అన్ని విధాలా ప్రోత్సహిస్తామని తెలిపారు. రాష్ట్ర ఆర్థిక వ్యవస్థ పూర్తిగా దెబ్బతిందని, చివరికి రిటైర్డ్ ఉద్యోగులకు అందాల్సిన ప్రయోజనాలను కూడా ప్రభుత్వం దారి మళ్లించడం అన్యాయమన్నారు. బీసీలకు 42శాతం చట్టబద్ధ రిజర్వేషన్ అమలు చేసిన తర్వాతే స్థానిక సంస్థల ఎన్నికలు జరపాలన్నారు. ఎన్నికల సమయంలో కాంగ్రెస్ ఇచ్చిన ఏ ఒక్క హామీ కూడా నెరవేర్చకపోవడంతో ప్రజలు అధికార పార్టీపై తీవ్రఆగ్రహంతో ఉన్నారన్నారు.

రైతులకు ఇచ్చిన హామీలు విస్మరించడంతో వారు అనేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని తెలిపారు. బీసీ, ఎస్సీ, ఎస్టీ సామాజిక వర్గాలను చైతన్యం చేసి వారిని రాజకీయ అధికారానికి దగ్గర చేయడం కోసం తమ పార్టీ ఆధ్వర్యంలో తెలంగాణ రాష్ట్రంలో సామాజిక చైతన్య యాత్రలను నిర్వహిస్తున్నామని కపిలవాయి దిలీప్ కుమార్ తెలిపారు. సమావేశంలో ఆర్ఎల్‌డీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రిషబ్ జైన్, హసన్ నాయక్ తదితరులు పాల్గొన్నారు.

శ్రీరాంసాగర్‌కు స్వల్పంగా ఇన్‌ఫ్లో

జగిత్యాల, నవంబరు 24 (ఆంధ్రజ్యోతి): శ్రీరాంసాగర్‌లోకి ఎగువ ప్రాంతాల నుంచి సోమవారం స్వల్పంగా నీరువస్తోంది. ఎగువ ప్రాంతంనుంచి ప్రాజెక్టులోకి 1,338 క్యూసెక్కుల వరద వచ్చి చేరుతోంది. ప్రాజెక్టు నుంచి సరస్వతీ కాలువద్వారా 650 క్యూసెక్కులు, తాగునీటి అవసరాల కోసం మిషన్ భగీరథ ద్వారా 231క్యూసెక్కులు, ఆవిరి రూపంలో 457 క్యూసెక్కుల నీరు పోతోంది. ప్రాజెక్టు పూర్తిస్థాయి నీటిమట్టం 80.501 టీఎంసీలు కాగా అంతేస్థాయి నీటిమట్టంతో ప్రాజెక్టు నిండుకుండలా ఉంది. ప్రాజెక్టులోకి ఈ యేడాది జూన్ 1వ తేదీ నుంచి ఇప్పటి వరకు 947.821 టీఎంసీల నీరు వచ్చిచేరగా, ప్రాజెక్టు నుంచి 880.108 టీఎంసీల నీరును దిగువకు వదిలారు.

వేములవాడ, కొండగట్టుకు పోటెత్తిన భక్తులు

- వేములవాడకు 50వేలకు పైగా భక్తుల రాక
- ఎల్‌ఈడీ స్క్రీన్‌లో రాజన్న దర్శనం



భీమన్న సన్నిధిలో భక్తుల రద్దీ

వేములవాడ టౌన్, నవంబరు 24 (ఆంధ్రజ్యోతి): వేములవాడలో భక్తజనసంద్రమైంది. రాష్ట్ర నలుమూలల నుంచి దాదాపు 50వేలకు పైగాభక్తులు తరలివచ్చి స్వామివారికి మొక్కులు చెల్లించారు. భీమేశ్వరాలయంలో స్వామివారి దర్శనానికి రెండుగంటల సమయం పట్టింది. ఎల్ఈడీ స్క్రీన్‌లోనూ రాజన్న దర్శనానికి రద్దీఏర్పడింది. ఆలయ పరిసరాలన్నీ భక్తులతో కిక్కిరిసిపోయాయి. వేలాదిమంది భక్తులు తలనీలాలు సమర్పించారు. ఓ వైపు ఆలయ విస్తరణ పనుల్లో భాగంగా భీమన్నను భక్తులు స్వామివారిని దర్శించుకోవడానికి ఇబ్బందుల పాలయ్యారు. ఎల్‌ఈడీ స్క్రీన్‌లో రాజరాజేశ్వర స్వామివారిని భక్తులు దర్శించుకున్నారు. భీమేశ్వరస్వామి దేవస్థానంలో వేలాదిమంది భక్తులు కోడెల మొక్కులు చెల్లించారు. ఆలయంలో స్వామివారికి భక్తులు అభిషేక పూజలు చేశారు. నిత్యాన్నదాన సత్రం పై అంతస్తులో కల్యాణం, సత్యనారాయణస్వామివ్రతాలు నిర్వహించారు. అనేకమంది భక్తులు కుంకు మపూజలు, పెద్ద పల్లకి సేవలు చేపట్టి భక్తినిచాటారు. అనంతరం భీమేశ్వర స్వామివారిని దర్శించుకున్నారు. భీమన్న సన్నిధిలో క్యూలైన్‌లోనే ఆలయ ఇవో వెళ్లి భక్తుల సమస్యలు అడిగి తెలుసు కున్నారు. భీమేశ్వరస్వామివారిని దర్శించుకున్న అనంతరం భక్తులు బద్దిపోచమ్మకు బోనాలు సమర్పించారు.

కొండగట్టులో భక్తుల రద్దీ

మల్యాల : కొండగట్టు ఆంజనేయస్వామి సన్నిధికి సోమవారం సాయంత్రం నుంచి రాత్రివరకు వేలాదిగా భక్తులు చేరుకోవడంతో కొండంతా రద్దీగా మారింది. సమ్మక్క, సారలమ్మ జాతరకు ముందు సోమవారం వేములవాడ రాజన్నను దర్శించుకొని మంగళవారం కొండగట్టు అంజన్నను దర్శించుకోవడం ఆనవాయితీ కావడంతో వివిధ ప్రాంతాల నుంచి వందలాది వాహనాల్లో భక్తులు కొండపైకి చేరుకున్నారు. దేవస్థానం పరిధిలోని సత్రాలు భక్తులతో నిండి పోగా, గదులు లేక చలిలో ఆరుబయట పడుకొని తీవ్ర అసౌకర్యానికి గురయ్యారు. ఈ సీజన్‌లో భక్తులు అధికసంఖ్యలో తరలివస్తారని తెలిసినప్పటికీ దేవస్థానం తరుపున కనీస సౌకర్యాలు కల్పించకపోవడం పట్ల స్థానికులు అధికారుల తీరుపై అసహనం వ్యక్తం చేస్తున్నారు.

● సెల్‌ఫోన్ అప్పగింత..

కొండగట్టు అంజన్న దర్శనానికి వచ్చిన హైదరాబాద్‌కు చెందిన విజయకుమార్‌రావు అనే భక్తుడు సెల్‌ఫోన్ పోగొట్టుకోగా అక్కడి పోలీసులకు దొరికింది. దీంతో విచారణ జరిపిన అనంతరం పోలీస్ అవుట్ పోస్టు ఏఎస్సై చిలుక శ్రీనివాస్ సెల్‌ఫోన్ భక్తుడికి అప్పగించారు.



కొండగట్టులో పార్కింగ్ స్థలంలో భక్తుల వాహనాలు

రాజుపేటలో దొంగల బీభత్సం

- బంగారం, వెండి, నగదు అపహరణ

గంబీరావుపేట, నవంబరు 24 (ఆంధ్రజ్యోతి): గంబీరావుపేట మండలం రాజుపేట గ్రామంలో ఆదివారం దొంగలు బీభత్సం సృష్టించారు. తాళాలు వేసిన ఇళ్లలోకి చొరబడి బంగారు, వెండి ఆభరణాలతోపాటు నగదు ఎత్తుకెళ్లారు. సుద్ద దేవవ్వ, దిడ్డి మణెవ్వ, బండి లచ్చవ్వ, బండి వెంకట, దిడ్డి కిష్టయ్యల ఇళ్ల తాళాలు పగులగొట్టి దొంగతనానికి పాల్పడ్డారు. ఐదుఇళ్లలో దొంగలు చొరబడి దొంగతనానికి పాల్పడ్డప్పటికీ, రెండు ఇళ్ళలో మాత్రమే చోరీ జరిగింది. ఇండ్లకు తాళం వేసి కొందరు బంధువుల వద్దకు వెళ్లగా, మరి కొందరు శుభకార్యం నిమిత్తం ఇతర గ్రామాలకు వెళ్లారు. దేవవ్వ మాత్రం ఇంటికి తాళంవేసి పక్కనే ఉన్నవారి అక్కఇంట్లో నిద్రించింది. అయితే దేవవ్వ అక్క ఇంటికి గొళ్లెం పెట్టి దేవవ్వ ఇంట్లో దొంగలు చోరీకి పాల్పడ్డారు. మరో ముగ్గురి ఇళ్ల తాళాలను దొంగలు పగుల గొట్టి లోనికి వెళ్లి దొంగతనానికి ప్రయత్నిస్తుండగా, సమీప ప్రజలు మేలుకుని కేకలు వేయ డంతో దొంగలు పారిపోయినట్లు తెలుస్తోంది. దేవవ్వ ఇంట్లో 4 తులాల బంగారు అభర ణాలు, 50 తులాల వెండి ఆభరణాలు, రూ. 50వేల నగదు ఎత్తుకెళ్లారు. మణెమ్మ ఇంట్లో 4తులాలన్నర బంగారం, 10తులాల వెండి. రూ.32వేల నగదు ఎత్తుకెళ్లారు. సంఘటన స్థలానికి సిరిసిల్ల డీఎస్పీ నాగేంద్రచారి వచ్చి పరిశీలించారు. అప్పట్లో నాగంపేటలో జరిగిన దొంగతనంపై కూడా డీఎస్పీ ఆరా తీశారు. క్లూస్ టీం, డాగ్ స్కాడ్ తనిఖీ చేశారు.

చోరీ కేసులో నిందితుడికి సంవత్సరం జైలు శిక్ష

సిరిసిల్ల రూరల్, నవంబరు 24 (ఆంధ్రజ్యోతి): చోరీ కేసులో నిందితుడికి ఒక సంవత్సరం జైలు శిక్ష విధిస్తూ సిరిసిల్ల ప్రథమ శ్రేణి న్యాయమూర్తి ప్రవీణ్ సోమవారం తీర్పు వెల్లడించినట్లు సిరిసిల్ల పట్టణ సీఐ కృష్ణ తెలిపారు. సిరిసిల్ల పోలీస్‌స్టేషన్‌లో సోమవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో టౌన్‌సీఐ మాట్లాడారు. సిరిసిల్లలోని సంజీవయ్యనగర్‌కి చెందిన దరిపల్లి రమేష్ ఆటో డ్రైవర్‌గా పనిచేస్తున్నాడు. ఈ యేడు ఏప్రిల్‌లో కుటుంబసభ్యులతో కలసి ఎల్లమ్మ దేవుని పండుగ చేసుకోవడానికి సొంత గ్రామమైన కనగర్తికి వెళ్లాడు. రమేష్ తమ్ముడు సురేష్ ఫోన్ చేసి ఇంట్లో దొంగలు పడ్డారని చెప్పగా రమేష్ వెంటనే ఇంటికి వచ్చి చూడగా బీరువా తాళాలు తెరిచి సామానులన్నీ చిందరవందరగా పడేసి ఉన్నాయి. బీరువాలో దాచిపెట్టిన 8తులాల బంగారు అభరణాలతో పాటు 20తులాల వెండి అభరణాలు చోరీ చేసినట్లు గుర్తించారు. దీంతో రమేష్ సిరిసిల్ల పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేయగా అప్పటి ఎస్ఐ శేఖర్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. దర్యాప్తులో భాగంగా దొంగతనం చేసిన వడ్డేపల్లి సత్యం అనే వ్యక్తిని అరెస్ట్ చేసి రిమాండ్ తరలించి కోర్టులో చార్జిషీట్ దాఖలు చేశారు. తర్వాత కోర్టు మానిటరింగ్ ఎస్ఐ ఆధ్వ ర్యంలో కోర్టు కానిస్టేబుల్ వేముల నరేష్ ఆరుగురు సాక్షులను ప్రవేశ పెట్ట ప్రాసిక్యూషన్ తరపున పబ్లిక్ ప్రాసిక్యూటర్ చెలుమల సందీప్ వాదించారు. న్యాయమూర్తి ప్రవీణ్ నిందితుడు వడ్డేపల్లి సత్యంకు ఒక సంవత్సరం కఠిన కారాగార జైలుశిక్ష విధించినట్లు తెలిపారు.

రాష్ట్ర, జాతీయ స్థాయికి ఎంపికైన విద్యార్థులు



బాబును, ప్రణతిని అభినందిస్తున్న పాఠశాలల సిబ్బంది

కొడిమ్యాల, నవంబరు 24 (ఆంధ్రజ్యోతి): మండలకేంద్రంలోని ప్రభుత్వజూనియర్ కళాశాలకు చెందిన కెబాబు కబడ్డీక్రీడల్లో ప్రతిభ చూపి రాష్ట్రస్థాయికి ఎంపికైనట్లు ప్రిన్సిపాల్ కె వేణు తెలిపారు. దీంతోకళాశాల సిబ్బంది విద్యార్థిని అభినందించారు. కార్యక్రమంలో స్పోర్ట్స్ ఇన్‌చార్జ్ బి నర్సయ్య, అధ్యాపకుడు నర్సయ్యసిబ్బంది ఉన్నారు.

జాతీయ స్థాయి కబడ్డీ పోటీలకు..

తిమ్మాపూర్: మండల కేంద్రంలోని మోడల్ కళాశాలలో ఎంపీసీ ఫస్ట్ ఇయర్ చదువుతున్న ప్రణతి జాతీయస్థాయి కబడ్డీజట్టుకు ఎంపికైనట్లు కళాశాల ప్రిన్సిపాల్ ఎం.వనజ తెలిపారు. భద్రాద్రి కొత్తగూడెంలో జరిగిన రాష్ట్రస్థాయి పోటీల్లో అత్యుత్తమ ప్రతిభ కనబరిచిందన్నారు. ఈ సందర్భంగా విద్యార్థిని ఫిజికల్ డైరెక్టర్ నాగరాజును ప్రిన్సిపాల్, అధ్యాపకులు, అభినందించారు.

బొంతకుంటపల్లిలో కొండచిలువ హతం

సుల్తానాబాద్, నవంబరు 24 (ఆంధ్రజ్యోతి): మండలంలోని బొంతకుంటపల్లిలో సోమవారం రైతులకు కొండచిలువ కనిపించింది. రైతులు పొలం పనుల్లో నిమగ్నమై ఉండగా, ఒక్కసారిగా మీదకు రావడంతో దానిని కర్రలతో కొట్టిచంపివేశారు. ఇటీవల పలుగ్రామాల్లో కొండచిలువ కనిపించడం, రైతులు, ప్రజలు భయాందోళనకు గురవుతున్నారు.



కొండచిలువతో గ్రామస్థులు

వైభవంగా వేంకటేశ్వరస్వామి బ్రహ్మోత్సవాలు



హోమం నిర్వహిస్తున్న పండితులు

కొడిమ్యాల, నవంబరు 24 (ఆంధ్రజ్యోతి): కొడిమ్యాల మండల కేంద్రంలోని లక్ష్మీ వేంకటేశ్వరస్వామి ఆలయంలో వెంకటేశ్వరస్వామి వైభవంగా బ్రహ్మోత్సవాలు కొన సాగుతున్నాయి. బ్రహ్మోత్సవాల్లో భాగంగా రెండవ రోజు సోమవారం వేంకటేశ్వర స్వామి ఆలయ ప్రాంగణంలో స్వామి వారికి పండితులు ఘనంగా ప్రత్యేక పూజలు చేసారు. ఆలయ ప్రాంగణంలో పరివార హోమం, దేవతా ఆహ్వానం కార్యక్రమాలను పండితులు నిర్వహించారు. అనంతరం ఆలయ నిర్మాణకమిటీ వారు, భక్తులు గ్రామస్తులకు అన్నదానం చేశారు. కార్యక్రమాల్లో ఆలయ కమిటీసభ్యులు, గ్రామ ప్రముఖులు, భక్తులు వందలాదిగా పాల్గొన్నారు.

కన్నుల పండువగా నారికేళ దీపోత్సవ శోభాయాత్ర



శోభాయాత్రలో పాల్గొన్న మహిళలు

కరీంనగర్ కల్చరల్, నవంబరు 24 (ఆంధ్రజ్యోతి): నగరంలోని భగత్‌నగర్ అయ్యప్ప దేవాలయ కమిటీ ఆధ్వర్యంలో సోమవారం నిర్వహించిన నారికేళ దీపోత్సవ శోభాయాత్ర కన్నులపండువగా సాగింది. గోవిందపతి శ్రీవారి సేవా సమితి సహకారంతో శోభాయాత్ర చేపట్టారు. మహిళలు కొబ్బరి ముక్కల్లో దీపాలు వెలిగించి మంకమ్మతోట వేంకటేశ్వరాలయంలో పూజలు చేసి అయ్యప్ప ఆలయం వరకు శోభాయాత్ర నిర్వహించారు. పట్టణ కాంగ్రెస్ అధ్యక్షుడు వైద్యుల అంజన్‌కుమార్, నాయకులు మల్లికార్జున రాజేందర్, కటకం వెంకటరమణ, జీఎస్ ఆనంద్, అయ్యప్ప ఆలయ ఛైర్మన్ వై. అనిల్‌కుమార్‌గౌడ్, ఈవో కొన్న కాంతారెడ్డి, వేంకటేశ్వరాలయ ఈవో శ్రీనివాస్, గోవిందపతి శ్రీవారి సేవాసమితి అధ్యక్షుడు పాలవేడు శ్రీనివాస్ పాల్గొన్నారు.

బీసీల ఆశలు గల్లంతు

(5వ పేజీ తరువాయి)

15జనరల్‌కు కేటాయించారు. మిగతా నాలుగు ఎస్టీ స్థానాల్లో రెండు మహిళలు, రెండు జనరల్‌గా ఉన్నాయి. ఎస్సీలకు 53 స్థానాలు కేటాయించగా 24 మహిళలకు, 29 జనరల్‌గా ఉన్నాయి. జనరల్ స్థానాలు 121ఉండగా 58 మహిళకు, 63 జనరల్ స్థానాలుగా కేటాయించారు. 2,268 వార్డుల్లో వంద శాతం ఎస్టీ పంచాయతీల్లో 176 వార్డులు ఉండగా 88 మహిళకు, 88 జనరల్, ఇతర 53 ఎస్టీ వార్డుల్లో 18 మహిళలకు, 35 జనరల్‌గా కేటాయించారు. 442 ఎస్సీ వార్డులలో 177 మహిళకు, 26 జనరల్‌గా ఉన్నాయి. 553 బీసీ వార్డుల్లో 222 మహిళకు,331 జనరల్ స్థానా లుగా ఉన్నాయి. 1,044 జనరల్ వార్డుల్లో 471 మహి ళలకు, 573 జనరల్‌గా ఉన్నాయి. కులగణన జీవో 9 ద్వారా రిజర్వేషన్లలో260 సర్పంచ్ స్థానాల్లో 30 ఎస్టీలకు,53 ఎస్సీలకు,101 బీసీలకు,76జనరల్ స్థానాలగా రిజర్వ్ చేశారు.

● పల్లెల్లో సందడి

రిజర్వేషన్లు ఖరారు రావడంతో పల్లెల్లో ఎన్నికల సందడి మొదలైంది. నోటిఫికేషన్ రావడమే తరువాయిగా ఆశావహులు పోటీకి సిద్ధమవుతున్నారు. 260 గ్రామపంచాయతీల్లో రిజర్వేషన్లు అనుకూలించిన వారు గ్రామాల్లో పెద్దల మద్దతుకు కసరత్తు ప్రారంభించారు. కుల సంఘాలు, యువజన సంఘాలు, పార్టీ పెద్దల భరోసా పొందడానికి ప్రయత్నాలు మొదలుపెట్టారు. మరోవైపు అధికార యంత్రాంగం రిజర్వేషన్లు ఖరారు చేసి గెజిట్ జారీ చేయడంతో పాటు ఎన్నికల నిర్వహణకు సర్వం సిద్ధం చేశారు. గ్రామీణ ప్రాంతాల్లో పంచాయతీ ఎన్నికల వాతావరణం ఏర్పడింది.

యువత స్వయం ఉపాధితో ముందుకు వెళ్లాలి

చందుర్తి, నవంబరు 24 (ఆంధ్ర జ్యోతి): యువత స్వయం ఉపాధితో ముందుకు వెళ్లాలని ప్రభుత్వ విప్ వేములవాడ ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్ అన్నారు. చందుర్తి మండల కేంద్రంలో విజయ తెలంగాణ డైరీ పార్లర్‌ని సోమవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతంలోని యువతీ, యువకులు స్వయం కృషితో ముందుకు వెళ్లాలని సూచించారు. ఈ కార్యక్రమంలో మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు చింతపంటి రామస్వామి, నాయకులు గొట్టే ప్రభాకర్, చిలుక త్రిభువన్, నిర్వాకులు లింగాల లింగయ్య, తదితరులు పాల్గొన్నారు.

మూలవాగుపై కాజ్‌వేల నిర్మాణం చేపట్టాలి

కోనరావుపేట, నవంబరు 24 (ఆంధ్రజ్యోతి) : కోనరావుపేట మూలవాగుపై కాజ్‌వేల నిర్మాణం చేపట్టాలని బీఆర్‌ఎస్ మండల అధ్యక్షుడు మల్యాల దేవయ్య కోరారు. కోనరావుపేటలో పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. మూలవాగులో నిజామాబాద్, మామిడిపల్లి, బావుసాయిపేట, వట్టిమల్ల, నిమ్మపల్లి కాజ్‌వేలు కొట్టుకుపోవడంతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని అన్నారు. ప్రస్తుతం ఈ గ్రామాలకు వెళ్లే మూలవాగులో తాత్కాలిక మరమ్మతులు చేపట్టాలని కోరారు. ఇందిరా మహిళా శక్తి చీరలు అందరికీ ఇవ్వాలని కోరారు. ఈ సమావేశంలో సెస్ వైస్ చైర్మన్ దేవరకొండ తిరుపతి, చంద్రయ్యగౌడ్, మహేందర్, జీవన్ గౌడ్ తదితరులు ఉన్నారు.

రేపు సామాజిక తనిఖీ ప్రజా వేదిక

ఎల్లారెడ్డిపేట, నవంబరు24(ఆంధ్రజ్యోతి): ఎల్లారెడ్డిపేట మండల పరిషత్తు కార్యాలయం ఆవరణలో ఈ నెల 26న సామాజిక తనిఖీ ప్రజావేదిక సభను నిర్వహించనున్నామని ఎంపీడీవో సత్తయ్య సోమవారం ఓ ప్రకటనలో తెలిపారు. ఈజీఎస్ పథకం కింద మండలంలోని పలు గ్రామాల్లో చేపట్టిన పనులకు సంబంధించిన తనిఖీ నివేదికలను వెల్లడించనున్నారని పేర్కొన్నారు. అన్ని గ్రామాల తాజా, మాజీ ప్రజాప్రతినిధులు, కూలీలు, వివిధ శాఖల అధికారులు హాజరు కావాలని ఎంపీడీవో సత్తయ్య కోరారు.

విద్యార్థుల క్షేత్ర సందర్శన

కోనరావుపేట, నవంబరు 24 (ఆంధ్రజ్యోతి) : కోనరావుపేట మండల కేంద్రంలోని ఎంపీపీఎస్ ప్రభుత్వ పాఠశాల మూడవ తరగతి నుంచి ఐదవ తరగతి విద్యార్థులకు ప్రభుత్వ అధికారుల విధుల పట్ల అవగాహన కల్పించారు. కోనరావుపేట పోలీస్ స్టేషన్, మండల పరిషత్తు కార్యాలయం, ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి సందర్శనకు వెళ్లిన విద్యార్థులకు ఎస్ఐ ప్రశాంత్ రెడ్డి, ఎంపీడీవో స్నిగ్ధా రెడ్డి, ప్రాథమిక ఆరోగ్య కేంద్ర వైద్యం పట్ల డాక్టర్ వేణుమాధవ్ విద్యార్థులకు అవగాహన కల్పించారు.

విద్యార్థినికి ఘన సన్మానం



విద్యార్థిని మనస్వినిని సన్మానిస్తున్న నాయకులు

వీర్నపల్లి(ఎల్లారెడ్డిపేట), నవంబరు24(ఆంధ్రజ్యోతి): జాతీయ స్థాయి యోగా పోటీల్లో అత్యంత ప్రతిభ కనబర్చిన వీర్నపల్లి మండలం బంజేరు గ్రామానికి చెందిన విద్యార్థిని బట్టు మనస్వినిని స్థానిక నాయకులు సోమవారం ఘనంగా సన్మానించారు. మారుమూల ప్రాంతంలోని గిరిజన విద్యార్థిని పట్టుదలతో జాతీయ స్థాయిలో రాణించడం గర్వించదగ్గ విషయమన్నారు. కార్యక్రమంలో ఏఎంసీ డైరెక్టర్ నక్క శ్రీనివాస్, నాయకులు తిరుపతి, హరిలాల్, రవీందర్, లచ్చిరాం, విష్ణు, రవి పాల్గొన్నారు.

బీఆర్‌ఎస్ జిల్లా అధ్యక్షుడికి పరామర్శ

ఎల్లారెడ్డిపేట, నవంబరు24(ఆంధ్రజ్యోతి): ఎల్లారెడ్డిపేట మండల కేంద్రానికి చెందిన బీఆర్‌ఎస్ రాజన్నసిరిసిల్ల జిల్లా అధ్యక్షుడు తోట ఆగయ్యను నాఫ్స్‌కాబ్ చైర్మన్ కొండూరి రవీందర్‌రావు, ఆ పార్టీ నేతలు సోమవారం వేర్వేరుగా పరామర్శించారు. గత కొంత కాలంగా భుజం నొప్పితో బాధపడుతూ ఇటీవల ఆగయ్య హైదరాబాద్‌లోని ఓ ప్రైవేటు ఆసుపత్రిలో శస్త్ర చికిత్స చేయించుకున్నారు. ఆయన తన స్వగృహంలో విశ్రాంతి తీసుకుంటున్నారు. ఆగయ్య ఆరోగ్య పరిస్థితిని రవీందర్‌రావు, పలువురు నేతలు అడిగి తెలుసుకున్నారు. ప్యాక్స్ చైర్మన్ కృష్ణారెడ్డి ఉన్నారు.

రాష్ట్ర స్థాయి ఖోఖో పోటీలకు నామాపూర్ విద్యార్థి



చరణ్‌ను అభినందిస్తున్న పీడీ శ్రీనివాస్

ముస్తాబాద్, నవంబర్ 24 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని నామాపూర్ జిల్లా పరిషత్ ప్రభుత్వ ఉన్నత పాఠశాల విద్యార్థి రాష్ట్ర స్థాయి ఖోఖో పోటీలకు ఎంపికయ్యారు. జగిత్యాల జిల్లా వెల్లుల్ల గ్రామంలో నిర్వహించిన అండర్ 17 ఖోఖో ఎస్‌జీఎఫ్ టోర్నమెంటులో జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల నామాపూర్‌కు చెందిన జి చరణ్ ఎంపికయ్యారు. రాష్ట్ర స్థాయి ఖోఖో పోటీలు యాదాద్రి భువనగిరి జిల్లాలో పంతంగిలో జరుగనున్నాయి. రాష్ట్ర స్థాయికి ఎంపికైన విద్యార్థి జి చరణ్‌ను పిడి కుంట శ్రీనివాస్ హెచ్‌ఎం ఎస్ సుధాకర్, ఉపాధ్యాయులు గ్రామస్థులు అభినదించారు.

ఎన్నికల కోసమే మహిళలకు చీరల పంపిణీ

ముస్తాబాద్, నవంబర్ 24 (ఆంధ్రజ్యోతి) ఎన్నికల ముందు ఓట్ల కోసమే మహిళలకు కాంగ్రెస్ ప్రభుత్వం చీరలు పంపిణీ చేస్తుందని బీఆర్ ఎస్ పార్టీ అధ్యక్షుడు శీలం స్వామి పేర్కొన్నారు. ముస్తాబాద్‌లోని బీఆర్‌ఎస్ పార్టీ కార్యాలయంలో మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చి రెండేళ్లయినా బతుకమ్మ పండుగకు చీరలు అందించినటువంటి రేవంత్ ప్రభుత్వం ఈ రోజు ఎన్నికల కోసం చీరలను గ్రామాల్లో అందిస్తుందన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వానికి బుద్ధి చెప్పడానికి మహిళలు సిద్దంగా ఉన్నా రన్నారు. ఈ కార్యక్రమంలో బీఆర్‌ఎస్ పార్టీ నాయకులు ఎండీ జహంగీర్, దలీప్ కుమార్,శేఖర్, సాయి తదితరులు పాల్గొన్నారు.

కాంగ్రెస్‌పార్టీ నాయకుడి ఆకస్మిక మృతి

ఇల్లంతకుంట, నవంబరు 24(ఆంధ్రజ్యోతి) : మండలంలోని సిరికొండ గ్రామానికి చెందిన కాంగ్రెస్‌పార్టీ నాయకుడు ఉమ్మరవేని రాజు (40) గుండెపోటుతో మృతిచెందాడు. గ్రామస్థుల వివరాల ప్రకారం.. సిద్దిపేటలోని లాడ్జీలో రాజు ఆదివారం మృతిచెంది ఉండటాన్ని గుర్తించి పోలీసులకు సమాచారం అందించారు. గ్రామంలో సోమవారం అంత్యక్రియలు జరిగాయి. కుటుంబీకులను మండల కాంగ్రెస్ అధ్యక్షుడు కోమటిరెడ్డి భాస్కర్‌రెడ్డి, కిసాన్‌సెల్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పాశం రాజేందర్‌రెడ్డి, మాజీ ఎంపీపీ అయిలయ్య, బొల్లవేని రమేష్, కేతిరెడ్డి నవీన్‌రెడ్డి పరామర్శించారు.

ప్రజావాణి ఫిర్యాదులను ఎప్పటికప్పుడు పరిష్కరించాలి



ప్రజావాణిలో ప్రజల సమస్యలు వింటున్న జిల్లా ఇన్‌చార్జి కలెక్టర్



కలెక్టరేట్‌కు తరలివచ్చిన సింగారం గ్రామస్థులు

సిరిసిల్ల కలెక్టరేట్, నవంబర్ 24 (ఆంధ్రజ్యోతి) : ప్రజావాణిలో వచ్చిన ప్రతి ఫిర్యాదును జిల్లా అధికారులు ఎప్పటికప్పుడు పరిష్కరించి ప్రజలకు న్యాయం చేయాలని జిల్లా ఇన్‌చార్జి కలెక్టర్ గరిమా అగర్వాల్ ఆదేశించారు. సిరిసిల్ల సమీకృత జిల్లా కలెక్టరేట్‌లోని సమావేశమందిరం సోమవారం నిర్వహించిన ప్రజావాణికి జిల్లా నలుమూల నుంచి ప్రజలు తరలి రావడంతో కలెక్టరేట్ కిటకిటలాడిపోయింది. కలెక్టరేట్‌లో ప్రజావాణికి వచ్చిన ప్రజలందరు తమ ఫిర్యాదులను ఆన్‌లైన్ చేసుకుని సమావేశ మందిరంలో నిర్వహించిన ప్రజావాణిలోకి వచ్చిన జిల్లా ఇన్‌చార్జి కలెక్టర్ గరిమా అగ్రవాల్ పాటు అదనపు కలెక్టర్ గడ్డం నగేష్, జిల్లా అధికారులను కలిసి సమస్యలను విన్నవించి ఫిర్యాదులను అందించారు. ఈ ప్రజావాణిలో 143 ఫిర్యాదుల వచ్చాయి. ఇందులో రెవెన్యూకు 42, హౌజింగ్ శాఖకు 22, సీపీవోకు 8, ఉపాధి కల్పనశాఖ అధికారికి 8, డీఆర్‌డీవోకు 7, ఎస్‌డీసీకి 7, డీఈవోకు 5, వేములవాడ ఆర్డీవోకు 5, డీపీవోకు 5, డీఈవోకు 5, డీఏవోకు 4, నీటిపారుదల శాఖకు 3, అబ్కారిశాఖకు 3, సెస్‌కు 3, కలెక్టరేట్ ఏవోకు 2, బీసీసంక్షేమాశాఖకు 2, సిరిసిల్ల మున్సిపాల్టీకి 2, సర్వేయర్‌కు 1, మత్స్య శాఖకు 1, మైనార్టీ సంక్షేమశాఖకు1, డీపీఆర్‌వోకు 1, ఈడీఎంకు1, ఆర్‌అండ్‌బీ ఈఈకి1, వేములవాడ ఎంపీడీవోకు 1, ఎల్లారెడ్డిపేట ఎంపీడీవోకు 1, వేములవాడ మున్సిపాల్టీకి 1 చొప్పున వచ్చాయి. ఈ సందర్భంగా ఇన్‌చార్జి కలెక్టర్ మాట్లాడుతూ ప్రజావాణిలో ఇప్పటి వరకు వచ్చిన ఫిర్యాదులను ఎన్ని పరిష్కరించారనే విషయాన్ని అధికారులను అడిగి తెలుసుకున్నారు. ఈ ప్రజావాణిలోట్రైనీ డిప్యూటీ కలెక్టర్ నిఖిత,డీఆర్‌డీవో శేషాద్రి, సిరిసిల్ల ఆర్డీవో వెంకటేశ్వర్లు, వేములవాడ ఆర్డీవో రాధాబాయ్ తదితరులు పాల్గొన్నారు.

భవన, ఇతర నిర్మాణ రంగ కార్మికులకు ప్రభుత్వం ప్రమాద, సహజ బీమాను పెంచగా దానికి సంబంధించిన వాల్‌పోస్టర్‌లను జిల్లా ఇన్‌చార్జీ కలెక్టర్ గరిమా అగ్రవాల్ అదనపు కలెక్టర్ గడ్డం నగేష్, కార్మిక శాఖ అధికారి నజీర్ అహ్మద్‌లతో కలిసి ఆవిష్కరించారు. కార్మికులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఇన్‌చార్జీ కలెక్టర్ కోరారు.

మిడ్‌మానేరులో ముంపుగురైన ఇళ్ల నష్టపరిహారం ఇవ్వాలి

మధ్యమానేరు జలాశయంలో ముంపునకు గురైన 18 ఇళ్లకు నష్ట పరిహారం రాలేదని జిల్లా కలెక్టర్ స్పందించి అ ఇళ్లకు పరిహారం అందించి మమ్ములను అదుకోవాలంటూ సోమవారం నిర్వాసితులు జిల్లా కలెక్టరేట్‌కు తరలివచ్చారు. మిడ్‌మానేరు డ్యాంలో ముంపుకు గురైన చింతల్‌ఠాణా గ్రామంలో మాకు ఉన్న 18 ఇళ్లు ముంపునకు గురైపోయాయని వాటికి ఇప్పటి వరకు నష్టపరిహారం ఇవ్వలేదన్నారు.

సన్నరకం ధాన్యానికి బోనస్‌లను చెల్లించాలి

ఎల్లారెడ్డిపేట మండలం సింగారం గ్రామంలో తాము పండించిన విక్రయించిన సన్నరకం ధాన్యానికి ఇవ్వాల్సిన బోనస్‌లను చెల్లించడంతోపాటు గ్రామంలో గత ప్రభుత్వ హయాంలో నిర్మించుకున్న డబుల్ బెడ్ రూంలకు రావాల్సిన రూ 5లక్షలను మంజూరుచేసి అదుకోవాలంటూ రైతులు సోమవారం సిరిసిల్ల జిల్లా కలెక్టరేట్‌కు తరలివచ్చారు. సన్నరకం ధాన్యం క్వింటాల్‌కు రూ 5వందల బోనస్ చెల్లించాల న్నారు.

కొడుకులు పోషించడంలేదు

- జాల లక్ష్మారెడ్డి, గుర్రంవాణిపల్లె, వేములవాడ

వేములవాడ అర్బన్ మండలంలోని గుర్రం వాణి పల్లె గ్రామానికి చెందిన మాకు ఇద్దరు కుమారులు, ఒక కుమార్తె ఉన్నారు. నేను వ్యవసాయం చేసుకుంటూ నాభార్యపిల్లలను పోషించుకుంటూ ఉన్నత చదువులు చదివించి పెళ్లిలుచేసి ఆస్తి కూడా పంచడం జరిగింది. వృద్ధాప్యంలో ఉన్న మా దంపతులను మా ఇద్దరు కొడుకులు పట్టించుకోకపోవడం లేదు. కలెక్టర్ స్పందించి ఇద్దరు కుమారులకు ఇచ్చిన ఐదు ఎకరాల భూమిని తిరిగి ఇచ్చి న్యాయం చేయాలని కోరారు.

ఇందిరమ్మ ఇళ్ల పనులు వేగవంతం చేయాలి

వీర్నపల్లి(ఎల్లారెడ్డిపేట), నవంబరు24 (ఆంధ్రజ్యోతి): లబ్ధిదారులు ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణ పనులను వేగవంతం చేయాలని ఎంపీడీవో శ్రీలేఖ అన్నారు. వీర్నపల్లి మండలం అడవిపదిర గ్రామంలో కొనసాగుతున్న ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణ పనులను సోమవారం ఆమె పరిశీలించారు. పనులు పూర్తయిన వెనువెంటనే ప్రభుత్వం విడతల వారీగా బిల్లులను చెల్లిస్తుందని పేర్కొన్నారు. అధికారులు ఇళ్ల నిర్మాణాలను ఎప్పటికప్పుడు పర్యవేక్షిస్తూ పనుల ప్రగతికి పాటు పడాలని ఎంపీడీవో శ్రీలేఖ సూచించారు. ఆమె వెంట పంచాయతీ కార్యదర్శి శ్రీధర్, కాంగ్రెస్ పార్టీ సేవాదళ్ మండల అధ్యక్షుడు బాబు, నాయకులు తదితరులు ఉన్నారు.

కమిషనరేట్ ముట్టడికి వెళ్తున్న కార్మికుల అరెస్ట్

గంభీరావుపేట, నవంబరు 24 (ఆంధ్రజ్యోతి) : మధ్యాహ్న భోజన కార్మికులను సోమవారం గంభీరావుపేట పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. తమ సమస్యల సాధనలో బాగంగా హైదరాబాద్‌లోని కమిషనరేట్ ముట్టడికి వెళుతున్న మధ్యాహ్న భోజన కార్మికులను పోలీస్‌లు అదుపులోకి తీసుకుని అరెస్ట్ చేశారు.

కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షుడికి సన్మానం

తంగళ్లపల్లి, నవంబరు 24 (ఆంధ్రజ్యోతి): నూతనంగా ఎన్నికైన కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు సంగీతం శ్రీనివాస్‌ను తంగళ్లపల్లి మండల పద్మశాలి సంఘం అధ్యక్షుడు, మాజీ ఏఎంసీ డైరెక్టర్ భైరి రమేశ్, కాంగ్రెస్ పార్టీ జిల్లా లీగల్ సెల్ స్పోక్స్ పర్సన్ బొద్దుల రాజేష్ సన్మానించారు. సోమవారం జిల్లా కేంద్రంలో కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షుడి నివాసంలో ఆయనను సత్కరించారు.

స్థానిక సమరానికి సమాయత్తం కావాలి



గంభీరావుపేటలో మాట్లాడుతున్న రవీందర్‌రావు

గంభీరావుపేట, నవంబరు 24 (ఆంధ్రజ్యోతి) : స్థానిక సమరానికి కార్యకర్తలు సమాయత్తం కావాలని నాఫ్‌స్కాప్ చైర్మెన్ కొండూరు రవీందర్‌రావు పేర్కొన్నారు. గంభీరావుపేట మండల కేంద్రంలోని బీఆర్‌ఎస్ పార్టీ కార్యాలయంలో సోమవారం పంచాయతీ ఎన్నికల సన్నాహక సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా రవీందర్‌రావు మాట్లాడుతూ ప్రభుత్వం విడుదల చేసిన రిజర్వేషన్ల ప్రకారం గ్రామాల వారీగా ఏ విధంగా ముందుకు వెళ్లాలో రవీందర్‌రావు దిశ నిర్దేశం చేశారు. పంచాయతీ ఎన్నికల్లో బీఆర్‌ఎస్ సత్తా చాటాలని, అందుకు ప్రతి కార్యకర్త కష్టపడాలన్నారు. ఈ నెల 29న జరిగే దీక్ష దివాస్ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలన్నారు. బీఆర్‌ఎస్ మండల శాఖ అధ్యక్షుడు పాపగారి వెంకటస్వామి, కొత్తపల్లి సింగిల్ విండో చైర్మెన్ భూపతి సురేందర్, పార్టీ నాయకులు దయాకర్‌రావు, లింగమ్‌యాదవ్, మల్లేశం, గౌసొద్దీన్, చేరాల వెంకటస్వామి, గంద్యాడపు రాజు, వహీద్, రాజనర్సు, కుతూబ్, నాగరాజు, బండ రమేష్, మీనయ్య తదితరులు ఉన్నారు.

ఇందిరమ్మ చీరల పంపిణీ



జంగమరెడ్డిపల్లెలో చీరలు పంపిణీ చేస్తున్న నాయకులు



గంభీరావుపేటలో ఇందిరమ్మ చీరల పంపిణీ

గంభీరావుపేట, నవంబరు 24 (ఆంధ్రజ్యోతి) గంభీరావుపేట మండల కేంద్రంలోని దోసల గూడెంకాలనీలో సోమవారం ఇందిరమ్మ చీరలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా మండల కాంగ్రెస్ అధ్యక్షుడు హమీద్ మాట్లాడుతూ ప్రజా అవసరాలను,సమస్యలను ఎప్పటికప్పుడు పరిష్కరిస్తూ కాంగ్రెస్ ప్రభుత్వం ముందుకు సాగుతోందన్నారు. చీరలను చూసి మహిళలు ఎంతో ఆనందం వ్యక్తం చేస్తు సీఎం రేవంత్ రెడ్డికి కృతజ్ఞతలు తెలుపుతున్నారని పేర్కొన్నారు. హమీద్‌తో పాటు నాయకులు అక్కపల్లి బాలయ్య, గౌరిశంకర్ తదితరులు ఉన్నారు.

ఇల్లంతకుంట : మహిళల అభివృద్ధే ధ్యేయంగా రాష్ట్రప్రభుత్వం పనిచేస్తుందని కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకుడు తూముకుంట రాజేందర్‌రెడ్డి పేర్కొన్నారు. మండలంలోని జంగమరెడ్డిపల్లె గ్రామంలో సోమవారం ఇందిరా మహిళాశక్తి చీరలను పంపిణీ చేశారు. కార్యక్రమంలో నాయకులు గూడ నరేందర్‌రెడ్డి, మారుపాక వెంకన్న, పసునూటి రవి, మంద సత్తిరెడ్డి, పారిపెల్లి సుధాకర్‌రెడ్డి, వీవోఏ రజిత, కుమ్మరవేని మమత, పండుగు దివ్య, మంద లత, పండుగు అంజలి, రజిత, అంజలి, రాజయ్య, పుష్పలతలతో పటు మహిళలు పాల్గొన్నారు.

ఎల్లారెడ్డిపేట: మహిళల సంక్షేమమే కాంగ్రెస్ ప్రభుత్వ ధ్యేయమని ఏఎంసీ చైర్‌పర్సన్ సబేరా బేగం అన్నారు. ఎల్లారెడ్డిపేట మండల కేంద్రంతో పాటు రాచర్లబొప్పాపూర్, రాచర్లగుండారం, కోరుట్లపేట, తదితర గ్రామాల్లో స్థానిక నాయకులతో కలిసి ఇందిరా మహిళా శక్తి చీరలను సోమవారం పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఐకేపీ ఏపీఎం నర్సయ్య, సీసీలు పద్మ, లక్ష్మణ్, ఏఎంసీ వైస్ చైర్మన్ రాంరెడ్డి, నాయకులు నర్సయ్య, లక్ష్మారెడ్డి, రాజేందర్, కిష్టారెడ్డి, చిన్నలక్ష్మీ, గౌస్, బాబు, గిరిధర్‌రెడ్డి, విజయ్‌రెడ్డి, సాహెబ్, దత్తాద్రిగౌడ్, బాల్‌రెడ్డి, భాస్కర్, రాజునాయక్, తిరుపతి, తదితరులు పాల్గొన్నారు.

వీర్నపల్లి(ఎల్లారెడ్డిపేట): అతివల అభ్యున్నతికి ప్రభుత్వం కృషి చేస్తుందని ఎంపీడీవో శ్రీలేఖ అన్నారు. వీర్నపల్లి మండలం అడవిపదిర, కంచర్ల, తదితర గ్రామాల్లో ఇందిరా మహిళా శక్తి చీరలను స్థానిక నాయకులతో కలిసి సోమవారం ఆమె పంపిణీ చేశారు. అడవిపదిరలో ఎంపీడీవో శ్రీలేఖ మాట్లాడుతూ మహిళలను కోటీశ్వరులను చేయాలనే లక్ష్యంతో ప్రభుత్వం అనేక పథకాలను ప్రవేశపెట్టి అమలు చేస్తోందని అన్నారు. కార్యక్రమంలో ఆయా గ్రామాల పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

సర్పంచ్, వార్డుమెంబర్ల రిజర్వేషన్లు ఖరారు

ఎల్లారెడ్డిపేట/వీర్నపల్లి, నవంబరు24(ఆంధ్రజ్యోతి): ఎల్లారెడ్డిపేట మండలంలో మొత్తం 26 గ్రామ పంచాయతీలుండగా వాటిలో 12, వీర్నపల్లిలో 17 పంచాయతీలకు 8 స్థానాల్లో మహిళలకు కేటాయించారు. ఎల్లారెడ్డిపేటలో మరో 10 స్థానాలను జనరల్, బీసీ, ఎస్సీ, ఎస్టీ జనరల్‌కు కేటాయించడంతో ఆ స్థానాల్లోనూ అతివలు పోటీ చేసే అవకాశం కల్పించారు. వీర్నపల్లిలో మరో 9 జనరల్, ఎస్టీ, ఎస్సీ జనరల్‌కు దక్కడంతో మహిళలు బరిలో నిలిచే చాన్స్ ఉంది. వీర్నపల్లిలో మొత్తం 17 గ్రామ పంచాయతీలకు ఏ ఒక్క స్థానం బీసీలకు దక్కకపోవడంతో ఆ వర్గాల్లో ఆందోళన నెలకొంది.

● ఎల్లారెడ్డిపేట మండలంలో..

జనరల్-అల్మాస్‌పూర్, బండలింగంపల్లి, గొల్లపల్లి, గుంటపల్లిచెరువుతండా, రాగట్లపల్లి, రాజన్నపేట.. జనరల్, మహిళ- అక్కపల్లి, బొప్పాపూర్, గుండారం, కిష్టునాయక్‌తండా, కోరుట్లపేట, పోతిరెడ్డిపల్లి.. బీసీ జనరల్- అగ్రహారం, హరిదాస్‌నగర్, నారాయణపూర్.. బీసీ మహిళ-పదిర, వెంకటాపూర్, ఎస్సీ జనరల్- దుమాల, తిమ్మాపూర్, ఎల్లారెడ్డిపేట, ఎస్సీ మహిళ-రాచర్లబాకురుపల్లి, సింగారం, ఎస్టీ జనరల్-బాకురుపల్లితండా, బుగ్గరాజేశ్వరతండా, ఎస్టీ మహిళ- దేవునిగుట్టతండా, జైసేవాలాల్‌తండా

● వీర్నపల్లి మండలంలో...

జనరల్ - గర్జనపల్లి, లాల్‌సింగ్‌తండా, మద్దిమల్ల, జనరల్, మహిళ-మద్దిమల్లతండా, రంగంపేట, వీర్నపల్లి.. ఎస్సీ జనరల్- కంచర్ల, వన్‌పల్లిఎస్సీ మహిళ- అడవిపదిర.. ఎస్టీ జనరల్-బాబాయిచెరువుతండా, బంజేరు, బావుసింగ్‌నాయక్‌తండా, భూక్యతండా.. ఎస్టీ మహిళ- ఎర్రగడ్డతండా, జవహర్‌లాల్ నాయక్‌తండా, సీతారాం నాయక్‌తండా, శాంతినగర్.

● ముస్తాబాద్ మండలంలో..

ముస్తాబాద్ : ఆవునూర్, బందనకల్, చీకోడ్ గ్రామాలకు బీసీ జనరల్‌గా, చిప్పలపెల్లి, గన్నేవానిపల్లె, కొండాపూర్, మోర్రాయిపల్లె, ముస్తాబాద్, వెంకట్రావుపల్లె, గ్రామాలకు జనరల్‌గా, గోపాల్‌పల్లె, గూడూరు, సేవాలాల్‌తండా, రాంరెడ్డిపల్లె, తుర్కపల్లెకు జనరల్ మహిళగా, గూడెం, మోహినికుంట, నామాపూర్, గ్రామాలకు ఎస్సీ జనరల్‌గా, మద్దికుంట, పోతుగల్, గ్రామాలకు ఎస్సీ మహిళగా మోర్రాపూర్ గ్రామం ఎస్టీగా , రామలక్ష్మణపల్లె, తెర్లుమద్ది గ్రామాలకు బీసీ మహిళగా రిజర్వేషన్లు ఖారారయ్యాయి.

గంభీరావుపేట మండలంలో...

గంభీరావుపేట : గంభీరావుపేట మేజర్ గ్రామ పంచాయతీతో పాటు నర్మాల గ్రామ పంచాయతీ బీసీ మహిళ, దమ్మన్నపేట, కొత్తపల్లి, నాగంపేట, పొన్నాలపల్లె, రాజేశ్వర్‌రావునగర్‌కాలనీ గ్రామ పంచాయతీలకు జనరల్ కేటాయించారు. రాజుపేట, దేశాయిపేట, గజసింగవరం, గోరంటాల, శ్రీగాధ గ్రామాలకు జనరల్ మహిళ, లింగన్నపేట, మల్లారెడ్డిపేట, మల్లుపల్లె గ్రామ పంచాయతీలకు బీసీ జనరల్ కేటాయించారు. సముద్రలింగాపూర్, ముస్తాఫనగర్ గ్రామ పంచాయితీలకు ఎస్సీ మహిళ కాగ, జగదాంబతండా, లక్ష్మీపూర్, హీరాలాల్‌తండాలకు ఎస్టీ జనరల్ రిజర్వు చేశారు. కోళ్ళమద్ది, ముచ్చర్ల గ్రామ పంచాయితలకు ఎస్సీ జనరల్ కేటాయించారు.

రుద్రంగి మండలంలో..

రుద్రంగి: రుద్రంగి సర్పంచ్ బీసీ జనరల్, మానాల జనరల్, అడ్డబోర్ తండా ఎస్టీ మహిళ, బడి తండ ఎస్టీ జనరల్, చింతామణి తండా ఎస్టీ మహిళ,దేగావత్ తండా ఎస్టీ జనరల్, గైదిగుట్ట తండా ఎస్టీ జనరల్, రూపులా నాయక్ తండ ఎస్టి జనరల్, సర్పంచ్ తండా ఎస్టీ మహిళ, వీరుని తండా ఎస్టీ మహిళ.

చందుర్తి మండలంలో..

చందుర్తి : అనంతపల్లి-జనరల్, ఆశిరెడ్డిపల్లి- బీసీ జనరల్, బండపల్లి -జనరల్, చందుర్తి -బీసీ జనరల్, దేవుని తాండ- ఎస్టీ జనరల్, జోగాపూర్ - జనరల్ మహిళ, కట్టలింగంపేట- జనరల్, కిష్టంపేట -ఎస్సీ జనరల్, కొత్తపేట -జనరల్, లింగంపేట- బీసీ జనరల్, మాల్యాల -ఎస్సీ మహిళ, మర్రిగడ్డ -జనరల్ మహిళ, మూడపల్లి జనరల్ మహిళ, నర్సింగపూర్ జనరల్, రామన్నపేట జనరల్ మహిళ, రామారావుపల్లి బీసీ మహిళ, సను గుల బీసీ మహిళ, తిమ్మాపూర్ ఎస్సీ జనరల్, ఎనగల్ ఎస్సీ మహిళకు రిజర్వు అయ్యాయి.

కోనరావుపేట మండలంలో...

కోనరావుపేట: కనగర్తి ఎస్సీ జనరల్, నిమ్మపెల్లి ఎస్సీ మహిళ, నిజామాబాద్ ఎస్సీ జనరల్, ఎగ్లాస్పూర్ ఎస్సీ జనరల్, మర్దనపేట ఎస్సీ మహిళ, బావుసాయిపేట బీసీ మహిళ, వెంకట్రావుపేట బీసీ మహిళ, సుద్దాల బిసి జనరల్, కొండాపూర్ బీసీ మహిళ, వట్టిమల్ల బీసీ జనరల్, ధర్మారం బీసీ జనరల్, మంగళపల్లి జనరల్ మహిళ, గొల్లపల్లి వట్టిమల్ల జనరల్ మహిళ, మరిమడ్ల జనరల్ మహిళ, శివంగాలపల్లి జనరల్ మహిళ, పల్లిమక్త జనరల్ మహిళ, రామన్నపేట జనరల్ మహిళ, కొలనూరు జనరల్, మామిడిపల్లి జనరల్, గొల్లపల్లి కొలనూరు జనరల్, మల్కాపేట జనరల్, కోనరావుపేట జనరల్, నాగారం జనరల్, అజ్మీరా తండా ఎస్టీ జనరల్, గోవిందరావుపేట తండా ఎస్టీ జనరల్, భూక్య రెడ్డి తండా ఎస్టి జనరల్, ఊరు తండా ఎస్టి మహిళ, కమ్మరిపేట తండా ఎస్టీ మహిళగా ఖరారు అయ్యాయి.

వేములవాడ రూరల్‌లో..

వేములవాడ రూరల్ : సర్పంచు స్థానానికి అచ్చన్నపల్లి ఎస్సీ జనరల్, బాలరాజుపల్లి ఎస్సీ మహిళ, బొల్లారం జనరల్ మహిళ, చెక్కపల్లి జనరల్ మహిళ, ఎదురుగట్ల బీసీ మహిళ, ఫాజుల్‌నగర్ జనరల్ మహిళ, హన్మాజిపేట బీసీ జనరల్, జయవరం జనరల్, లింగంపల్లి జనరల్, మల్లారం జనరల్ మహిళ, మర్రిపల్లి బీసీ మహిళ, నాగాయపల్లి బీసీ జనరల్, నమలిగుండుపల్లి జనరల్, నూకలమర్రి ఎస్సీ జనరల్, తుర్కాష్‌నగర్ జనరల్, వట్టెంల జనరల్, వెంకటాంపల్లి ఎస్సీ మహిళకు కేటాయించారు.

● **వేములవాడ టౌన్:** వేములవాడ అర్బన్ మండలంలోని 11 గ్రామాల సర్పంచ్‌ల రిజర్వేషన్‌లు ఖరారుచేస్తూ గెజిట్ నోటిఫికేషన్‌ను సోమవారం జిల్లా కలెక్టర్ విడుదల చేశారు. వేములవాడ అర్బన్ మండలంలోని ఆరెపల్లి , శభాష్‌పల్లి, కొడుముంజ (జనరల్), చీర్లవంచ, రుద్రవరం, గుర్రవాని పల్లి (జనరల్ మహిళ), సంకెపల్లి (బిసి జనరల్), చంద్రగిరి (బిసి మహిళ), చింతలఠాణ, మారుపాక (ఎస్సీ జనరల్,) అనుపురం (ఎస్సీ మహిళ)కు రిజర్వు అయ్యాయి.

బోయినపల్లి మండలంలో..

బోయినపల్లి : మండలంలో మొత్తం 23 గ్రామపంచాయతీలలో 217 వార్డు స్థానాలు ఉన్నాయి. సర్పంచ్ రిజర్వేషన్లు గ్రామాల వారీగా అనంతపల్లె ఎస్సీ మహిళా, బోయినపల్లి జనరల్ ,బూరుగుపల్లి జనరల్ మహిళ, దేశాయిపల్లి జనరల్ మహిళ,దుండ్రాపల్లి ఎస్సీ జనరల్.ల, గుండన్నపల్లి జనరల్ మహిళ, జగ్గారావుపల్లి ఎస్సీ జనరల్, కోరేం ఎస్సీ మహిళా, కొదురుపాక ఎస్సీ మహిళా, కొత్తపేట ఎస్సీ జనరల్, మల్కాపూర్ బీసీ మహిళ, మానువాడ బీసీ జనరల్, మర్ల పేట జనరల్ ,నర్సింగాపూర్ బీసీ మహిళ, నీలోజీపల్లి జనరల్, రామన్నపేట జనరల్ మహిళ, రత్నంపేట జనరల్ ,స్తంభంపల్లి జనరల్,తడగొండ బీసీ జనరల్ ,వర్ధవెల్లి జనరల్,వెంకట్రావుపల్లి జనరల్ మహిళ, విలాసాగర్ బీసీ జనరల్, మల్లాపూర్ జనరల్ మహిళ రిజర్వేషన్ల జాబితాను అధికారులు వెల్లడించారు.

ఇల్లంతకుంటలో..

ఇల్లంతకుంట : మండలంలోని 33 గ్రామపంచాయతీ సర్పంచ్‌ల రిజర్వేషన్లు ఖరారు అయ్యాయి. జనరల్ స్థానాలుగా రంగపేట, చిక్కుడువానిపల్లె, సిరికొండ, రామోజిపేట, తెనుగువారిపల్లె, గాలిపెల్లి, వెంకట్రావుపల్లె, ముస్కానిపేట, కేసన్నపల్లె, జనరల్ మహిళలకు నర్సక్కపేట, ఒబులాపూర్, కందికట్కూర్, కిష్టరావుపల్లె, రహీంఖాన్‌పేట, అనంతారం, తిప్పాపూర్, సోమారంపేట, తాళ్ళపెల్లి, బీసీ జనరల్ స్థానాలుగా వల్లంపట్ల, వెల్జీపూర్, అనంతగిరి, రేపాక, ఆరెపల్లి, బీసీ మహిళలకు బోటిమీదిపల్లె, దాచారం, గూడెపుపల్లి, జంగమరెడ్డిపల్లె, ఎస్సీ జనరల్ స్థానాలుగా ఇల్లంతకుంట, తాళ్ళల్లపల్లి, పత్తికుంటపల్లె, జవారిపేట, ఎస్సీ మహిళలకు గొల్లపల్లి, పెద్దలింగాపూర్, పొత్తూరు, వంతడుపుల గ్రామాలను కేటాయించారు.

తంగళ్లపల్లి మండలంలో..

తంగళ్లపల్లి, నవంబరు 24 (ఆంధ్రజ్యోతి): తంగళ్లపల్లి మండలంలోని 30 గ్రామ పంచాయతీలలో 30 సర్పంచ్, 252 వార్డు స్థానాలకు రిజర్వేషన్ ఖరారు చేస్తూ అధికారులు సోమవారం గెజిట్ నోటిఫికేషన్ విడుదల చేశారు. సర్పంచ్‌కు సంబంధించి తంగళ్లపల్లి, ఇందిరమ్మకాలనీ, పాపయ్యపల్లె, గండిలచ్చపేట, రాళ్లపేట, అంకుసాపూర్, బస్వాపూర్, అంకిరెడ్డిపల్లె గ్రామాల సర్పంచ్ స్థానాలు జనరల్‌కు కేటాయించారు. అలాగే పద్మనగర్, ఇందిరానగర్, సారంపల్లి, రామన్నపల్లె, నర్సింహులపల్లె, వేణుగోపాల్‌పూర్, మల్లాపూర్ స్థానాలను జనరల్ మహిళలకు కేటాయించారు. ఎస్సీ జనరల్‌గా తాడూరు, ఒబులాపూర్, గోపాల్‌రావుపల్లె గ్రామాలను ఎంపిక చేశారు. ఎస్సీ మహిళ స్థానాలు బద్దనపల్లి, కస్బెకట్కూర్, చిన్నలింగపూర్ గ్రామాలను కేటాయించారు. అలాగే లక్ష్మీపూర్, బాలమల్లుపల్లె, మండేపల్లి, నేరెళ్ల, రాంచంద్రపూర్ గ్రామాలను బీసీ జనరల్‌కు కేటాయించారు. చింతల్‌ఠాణ, చీర్లవంచ, దేశాయిపల్లె, జిల్లెల్ల గ్రామాల స్థానాలకు బిసి మహిళలకు కేటాయించారు.

విద్యుత్ అంతరాయం

తంగళ్లపల్లి, నవంబరు 24 (ఆంధ్రజ్యోతి): తంగళ్లపల్లి మండలంలోని నేరెళ్ల, కస్బెకట్కూర్, అంకిరెడ్డిపల్లె సబ్‌స్టేషన్ల పరిధిలోని గ్రామాలకు నేడు విద్యుత్తు అంతరాయం ఉంటుందని సెస్ ఏఈ మధుకర్ ఒక ప్రకటనలో తెలిపారు. మంగళవారం ఉదయం 10.30 గంటల నుంచి మధ్యాహ్నం 2.30 గంటల వరకు విద్యుత్తు అంతరాయం ఉంటుందన్నారు.

అంగన్‌వాడీ కేంద్రానికి టీవీ అందజేత

ఎల్లారెడ్డిపేట, నవంబరు24(ఆంధ్రజ్యోతి): ఎల్లారెడ్డిపేట మండలం కోరుట్లపేట గ్రామంలోని అంగన్‌వాడీ కేంద్రానికి ఎన్‌ఆర్ఐ సాయివరుణ్‌రెడ్డి, పూర్వ విద్యార్థి తాడ కార్తీక్‌రెడ్డి సమకూర్చిన రూ.15 వేల విలువైన స్మార్ట్ టీవీని సోమవారం అందజేశారు. కార్యక్రమంలో తాడ కార్తీక్ రెడ్డి,తాజా, మాజీ ఎంపీటీసీ మధు, అమ్మ ఆదర్శ పాఠశాల కమిటీ చైర్‌పర్సన్ సవిత, అంగన్‌వాడీ టీచర్ అసిపియా, ఉపాధ్యాయులు ప్రశాంత్, లక్ష్మీ, శిరీష, స్థానికులు ప్రతాప్‌రెడ్డి, శివశంకర్ ఉన్నారు.